@vaartanews @mvnewstv
www.mivaartanews.com
TGBIL/25/A0512
మీ వార్త
AP EDITION
ప్రతి అక్షరం... ప్రజల కోసం
విజయవాడ
మంగళవారం 10 నవంబర్ 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-



తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్‌లు,
నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు,
మండలాల వారీగా విలేకరులు కావలెను.

సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

అభివృద్ధికి ప్రజామోదమే ఈ విజయం

- అందరికీ కృతజ్ఞతలు: చంద్రబాబు
- స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభంజనం
- 2024తో పోలిస్తే పెరిగిన ప్రజాదరణ
- 100 పట్టణ స్థానిక సంస్థల్లో 94 చోట్ల విజయం
- వైఎస్సార్సీపీపై సీఎం విమర్శలు



అమరావతి

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్సీపీని మరింతగా తిరస్కరించి, కూటమికి ఘన విజయాన్ని అందించారని తెలుగుదేశం అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పట్టణాలు, పల్లెలు, అన్ని వర్గాల ప్రజలు కూటమికి ఒకే విధమైన మద్దతు పలికారని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో జరిగిన ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించారని పేర్కొన్నారు. కూటమి అభ్యర్థులకు విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలందరికీ శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని అన్నారు. రెండున్నరేళ్ల పాలనలో అభివృద్ధి, సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన ఆమోదమే ఈ ఫలితాలని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల ఫలితాలపై నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే కూటమికి ప్రజాదరణ మరింత పెరిగిందని చెప్పారు. కేడర్ బేస్ పార్టీ టీడీపీ అని, సేవాభావమే తమ రాజకీయ విధానమని - మిగతా 3లో



ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధం

- దేశద్రోహి' ఆరోపణలపై రాహుల్ ఫైర్..
- మోదీకి బహిరంగ చర్చకు సవాల్!
- 'ఎవరూ దేశద్రోహులు? విదేశీ శక్తుల చేతుల్లో ఉన్నదెవరు?'
- ఏ సమయంలోనైనా.. ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధం
- జవాన్లు ప్రధాని వ్యాఖ్యలను నమ్మలేదంటూ రాహుల్ వ్యాఖ్యలు



డీలిమిటేషన్ బిల్లు కోసమే పార్లమెంట్ ప్రారోగేషన్ ఆలస్యం

- బీజేపీపై కాంగ్రెస్ ఫైర్!
- 88 రోజులైనా ప్రారోగ్ కాని పార్లమెంట్ సమావేశాలు
- మోదీకి ఖర్గే నాలుగు లేఖలు రాసినా స్పందన లేదు
- అమిత్ షాకు సమయం ఇచ్చేందుకే జాప్యమంటూ జైరాం రమేశ్ ఆరోపణ

పదేళ్లలోనే పెను మార్పు.. భారత్‌పై ప్రపంచ బ్యాంకు ప్రశంసలు



- 27.1 శాతం నుంచి 2.6 శాతానికి తగ్గిన పేదరికం
- తీవ్ర పేదరికం నుంచి బయటపడిన 49.6 కోట్ల మంది
- భారత్ పురోగతిని ప్రశంసించిన ప్రపంచ బ్యాంకు
- పేదల్లో 57 శాతం మంది ఉత్తర, తూర్పు ప్రాంతాల్లోనే
- 2.24 లక్షల కోట్ల డాలర్లకు చేరిన కుటుంబాల ఖర్చు

వాయిదాల వలయంలో కృష్ణా, గోదావరి బోర్డులు!

- ఆరుసార్లు వాయిదా పడిన కేఆర్ఎంబీ భేటీ
- 20 నెలలుగా జీఆర్ఎంబీ సమావేశం లేదు
- పరిష్కారానికి నోచుకోని కీలక జల సమస్యలు



హైదరాబాద్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య నదీ జలాల వివాదాలకు పరిష్కారం చూపాల్సిన కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల సమావేశాలు వాయిదాల పర్వంగా మారాయి. కీలక సమస్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సిన భేటీలు పదేపదే వాయిదా పడుతుండటంతో జల వివాదాల పరిష్కారం మరింత జాప్యమవుతోంది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) 21వ సమావేశం ఏకంగా ఆరుసార్లు వాయిదా పడగా, గోదావరి నదీ యాజమాన్య బోర్డు - మిగతా 3లో

88 రోజులుగా ప్రారోగ్ కాని పార్లమెంట్!



- 18 ఏళ్ల రికార్డు బద్దలు..
- 2008 నాటి 87 రోజుల రికార్డు బద్దలు
- డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల కోసమేనా జాప్యం?
- ప్రారోగేషన్‌పై రాజ్యాంగంలో నిర్దిష్ట గడువు లేదు



ప్రధాని మోదీతో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కీలక ఫోన్ సంభాషణ

- చర్చలు మరియు దౌత్య మార్గాల ద్వారానే సమస్య పరిష్కారమవుతుందని స్పష్టం చేసిన పీఎంఓ
- శాంతి స్థాపనకు అవసరమైన అన్ని చర్యలకు సహకరించేందుకు భారత్ సిద్ధమని వెల్లడి
- యుద్ధాన్ని ముగించేలా ఇతర దేశాల నేతలతో భారత్ చర్చలు జరపాలని కోరిన జెలెన్‌స్కీ
- ఆహార భద్రత, ఇంధన రక్షణపై అన్ని పక్షాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు జైశంకర్ స్పష్టీకరణ

ఏపీ సీపీఎస్ ఉద్యోగులకు గుడ్‌న్యూస్



- ఓపీఎస్‌లోకి మారే అవకాశం!
- అర్హులకు వన్‌టైమ్ ఆప్షన్
- డిసెంబర్ 31లోగా దరఖాస్తు
- జీవో 158 జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పరిధిలో ఉన్న వేలాది మంది ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. అర్హులైన ఉద్యోగులు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)లోకి మారేందుకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్ జీవో ఎంఎస్ నంబర్ 158ను విడుదల చేశారు. 2026 జూలై 13న జారీ చేసిన జీవో 53కు అనుగుణంగా ఈ ప్రక్రియను పారదర్శకంగా, నిర్దిష్ట గడువులో పూర్తి చేసేందుకు సమగ్ర - మిగతా 3లో



ఎర్రకోట పేలుడు తర్వాత ఉగ్రవాదంపై ఉక్కుపాదం

- ఏడాదిలో 300 మందికి పైగా అరెస్టు
- విదేశాల నుంచి 73 మంది మోస్ట్ వాంటెడ్ నిందితుల అప్పగింత
- 'ప్రహార్' వ్యూహంతో నెట్‌వర్క్‌లపై నిఘా
- 'ప్రహార్'తో ఉగ్రవాదంపై ప్రత్యేక వ్యూహం

ఏపీఎండీసీకి ప్రభుత్వం భారీ ఊరట

- మరో రూ.115 కోట్ల అదనపు గ్యారంటీ!
- బొగ్గు గనుల వేలంలో మరింత చురుగ్గా పాల్గొనేందుకు అవకాశం
- రుణ గ్యారంటీ పరిమితి రూ.1,021.52 కోట్లకు పెంపు
- అదనపు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

APMDC
dhra Pradesh Mine
Development Corp

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో మైనింగ్ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)కి మరో రూ.115 కోట్ల అదనపు ప్రభుత్వ గ్యారంటీని మంజూరు చేసింది. దేశవ్యాప్తంగా నిర్వహించే బొగ్గు గనుల వేలంలో సంస్థ మరింత చురుగ్గా పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక వెసులుబాటు కల్పిస్తూ - మిగతా 3లో

ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధం

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షాలపై దేశద్రోహులు, విదేశీ శక్తుల చేతుల్లో కీలుబొమ్మలుగా ఉన్నారంటూ చేసిన ఆరోపణలపై ప్రధాని బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. గతంలో తాను చేసిన సవాల్ ఇప్పటికీ అలాగే ఉందని, ఏ సమయంలోనైనా, ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో రాహుల్ గాంధీ పోస్ట్ చేశారు.

జవాన్లు మోదీ వ్యాఖ్యలను నమ్మలేదంటూ..

దీపావళి సందర్భంగా భద్రతా సిబ్బందిని ఉద్దేశించి ప్రధాని మోదీ చేసిన ప్రసంగంపై రాహుల్ గాంధీ స్పందించారు. ప్రసంగం వింటున్న జవాన్ల ముఖ కవళికలను చూస్తే ప్రధాని చెప్పిన మాటలను వారు నమ్మలేదని అర్థమవుతోందంటూ వ్యాఖ్యానించారు. తమను నక్సలైట్లుగా అభివర్ణించారని పేర్కొంటూ, ఎవరు దేశద్రోహులు? విదేశీ శక్తుల నియంత్రణలో ఉన్నదెవరు? అనే అంశాలపై చర్చకు రావాలని మోదీని కోరారు. చర్చ తర్వాత ప్రధాని ఒక్క జవాన్ ముందు కూడా నిలబడలేరంటూ విమర్శించారు. దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నది ఎవరు? విదేశీ శక్తుల



ప్రభావంలో ఉన్నది ఎవరు? అనే అంశాలపై ప్రజలకు స్పష్టత రావాల్సిన అవసరం ఉందని రాహుల్ గాంధీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రధాని మోదీతో బహిరంగ చర్చకు తాను ఎప్పుడైనా సిద్ధమేనని పునరుద్ఘాటించారు.

బస్తర్‌లో జవాన్లతో మోదీ దీపావళి

ఆదివారం ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో భద్రతా సిబ్బందితో కలిసి ప్రధాని నరేంద్ర మోదీ దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవాన్లను ఉద్దేశించి ప్రసంగిస్తూ దేశంలో సాయుధ నక్సలిజం తగ్గుముఖం పట్టినప్పటికీ, ముప్పు పూర్తిగా తొలగిపోలేదని పేర్కొన్నారు. 'దిమాగీ నక్సల్స్' పేరుతో కొన్ని సంస్థలు, రాజకీయ పార్టీల్లోకి చొరబడి రాజ్యాంగం, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. అలాంటి శక్తులను గుర్తించి ఎదుర్కోవాలని భద్రతా సిబ్బందికి పిలుపునిచ్చారు.

గత ప్రభుత్వాలపై మోదీ విమర్శలు

నక్సల్స్ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనే భద్రతా సిబ్బందికి గత ప్రభుత్వాలు తగిన స్వేచ్ఛ ఇవ్వలేదని ప్రధాని విమర్శించారు. నక్సలైట్లు దాడులకు పాల్పడినప్పుడు ధీటుగా స్పందించే అవకాశం భద్రతా దళాలకు ఉండేది కాదని అన్నారు. తమ ప్రభుత్వం మాత్రం అవసరమైన నిర్ణయాలు తీసుకునే పూర్తి స్వేచ్ఛను భద్రతా బలగాలకు కల్పించిందని పేర్కొన్నారు.

గతంలోనూ విదేశీ శక్తుల అంశంపై సవాల్

గతంలోనూ విదేశీ శక్తుల ప్రభావంపై ప్రధాని మోదీని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. భారత ఆర్థిక వ్యవస్థపై విదేశీ శక్తుల ప్రభావం ఉందంటూ ఆరోపణలు చేశారు. ఈ అంశాలపై మోదీతో బహిరంగ చర్చకు సిద్ధమని అప్పట్లోనే సవాల్ విసిరారు. తాజాగా బస్తర్ పర్యటనలో ప్రధాని చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మరోసారి అదే సవాల్‌ను రాహుల్ గాంధీ పునరుద్ఘాటించడంతో రాజకీయంగా ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

డీలిమిటేషన్ బిల్లు కోసమే పార్లమెంట్ ప్రొరోగేషన్ ఆలస్యం

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడి 88 రోజులు గడిచినా, ఇప్పటివరకు అధికారికంగా ప్రొరోగ్ చేయకపోవడంపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంది. డీలిమిటేషన్ బిల్లును ఎలాగైనా ఆమోదింపజేసుకోవాలనే ఉద్దేశంతోనే మోదీ ప్రభుత్వం ఈ జాప్యం చేస్తోందని ఆరోపించింది. లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీని సాధించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సమయం కల్పించడమే దీని వెనుక ఉద్దేశమని విమర్శించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పోస్టు చేశారు.

మోదీకి ఖర్గే నాలుగు లేఖలు!

డీలిమిటేషన్ ప్రక్రియపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గత ఆరు నెలల్లో ప్రధాని నరేంద్ర మోదీకి నాలుగు సార్లు లేఖలు రాశారని జైరాం రమేశ్ వెల్లడించారు. అయినప్పటికీ ప్రధాని నుంచి సానుకూల స్పందన రాలేదని ఆరోపించారు. పార్లమెంట్ ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడి 88 రోజులు గడిచినా, సమావేశాలను అధికారికంగా ప్రొరోగ్ చేయలేదని పేర్కొన్నారు.

కౌల్ అండ్ శక్ధేర్ పుస్తకాన్ని ప్రస్తావిస్తూ..

భారత పార్లమెంటరీ విధానాలకు సంబంధించిన ప్రామాణిక గ్రంథం 'కౌల్ అండ్ శక్ధేర్' ఎనిమిదో సంచికలోని 192వ పేజీని జైరాం రమేశ్ ప్రస్తావించారు. సాధారణంగా సభ నిరవధిక వాయిదాకు, సమావేశాల ప్రొరోగేషన్‌కు మధ్య రెండు నుంచి నాలుగు రోజుల వ్యవధి ఉంటుందని అందులో పేర్కొన్నట్లు తెలిపారు. అదే పేజీలోని ఫుట్‌నోట్ 53 ప్రకారం, 2015 నాటి వర్షాకాల సమావేశాల సందర్భంగా ఈ వ్యవధి



28 రోజులుగా నమోదైందని గుర్తుచేశారు. 2024లో విడుదలైన ఈ పుస్తకానికి ప్రధాని మోదీ ప్రత్యేక సందేశం కూడా పంపారని పేర్కొన్నారు.

2008 నాటి రికార్డును ప్రస్తావించిన కేంద్ర మంత్రి

2008లో యూపీఏ ప్రభుత్వ హయాంలోనూ పార్లమెంట్ సమావేశాలు 87 రోజుల పాటు ప్రొరోగ్ కాలేదని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇటీవల కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు లేఖ రాశారు. దీనిపై జైరాం రమేశ్ స్పందిస్తూ.. అప్పట్లో ప్రత్యేక పరిస్థితుల కారణంగా అన్ని పార్టీల ఏకాభిప్రాయంతోనే ఈ జాప్యం జరిగిందని పేర్కొన్నారు.

డీలిమిటేషన్ బిల్లుపై మరోసారి పోరాటం!

2008 నాటి పరిస్థితులకు, ప్రస్తుత పరిస్థితులకు చాలా తేడా ఉందని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. అమిత్ షాకు సమయం కల్పించి, డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవడానికే ప్రస్తుత జాప్యం జరుగుతోందని ఆరోపించారు. గతంలో 2026 ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రతిపక్షాల ఐక్యత కారణంగా ఈ బిల్లు విషయంలో ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలిందని పేర్కొన్నారు. మరోసారి కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను ప్రతిపక్షాలు అడ్డుకుంటాయని స్పష్టం చేశారు. అమిత్ షా అనుసరిస్తున్న బుల్డోజర్ రాజకీయాలను ఎదుర్కొంటామని జైరాం రమేశ్ హెచ్చరించారు.

88 రోజులుగా ప్రొరోగేషన్ పెండింగ్!

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13న ముగిశాయి. నవంబర్ 9 నాటికి ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడి 88 రోజులు పూర్తయ్యాయి. దీంతో 2008లో నమోదైన 87 రోజుల రికార్డు అధిగమించబడిందని కాంగ్రెస్ పేర్కొంది. అయితే, పార్లమెంట్ సమావేశాలను అధికారికంగా ప్రొరోగ్ చేయడానికి రాజ్యాంగంలో నిర్దిష్ట గడువు లేదని జైరాం రమేశ్ ప్రస్తావించిన నిబంధనల ఆధారంగా చర్చ జరుగుతోంది. పార్లమెంట్ సమావేశాల ప్రొరోగేషన్ ఆలస్యంపై అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. డీలిమిటేషన్ అంశంపై అఖిలపక్ష చర్చ జరగాలన్న కాంగ్రెస్ డిమాండ్ నేపథ్యంలో ఈ వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

88 రోజులుగా ప్రొరోగ్ కాని పార్లమెంట్!

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడి 88 రోజులు గడిచినా, ఇప్పటికీ అధికారికంగా ప్రొరోగ్ (సమావేశాల ముగింపు ప్రకటన) కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. పార్లమెంటరీ చరిత్రలో అరుదైన పరిణామంగా నిలిచిన ఈ ఘటనతో 2008లో నమోదైన 87 రోజుల రికార్డు బద్దలైంది. ఆగస్టు 13న లోక్‌సభ, రాజ్యసభలను నిరవధికంగా వాయిదా వేసినప్పటికీ, అధికారికంగా ప్రొరోగేషన్ ఉత్తర్వులు జారీ కాలేదు. నవంబర్ 9 నాటికి ఈ వ్యవధి 88 రోజులకు చేరింది.

రాజ్యాంగ సవరణ కోసమేనా జాప్యం?

వర్షాకాల సమావేశాలకు అధికారికంగా ముగింపు ప్రకటించకపోవడంతో పార్లమెంట్‌ను తక్కువ వ్యవధిలోనే తిరిగి సమావేశపరిచే అవకాశం ఉందనే ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును మరోసారి ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అనుసరిస్తోందనే చర్చ జరుగుతోంది. ప్రతిపాదిత 131వ రాజ్యాంగ సవరణ ద్వారా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) చేపట్టి, లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 543 నుంచి గరిష్ఠంగా 850కి పెంచాలనే ప్రతిపాదన ఉన్నట్లు సమాచారం. ఈ మార్పులతో మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయాలన్నది కేంద్రం లక్ష్యంగా చెబుతున్నారు.

గతంలో బిల్లుకు ఎదురుదెబ్బ

2026 ఏప్రిల్ 17న జరిగిన ప్రత్యేక పార్లమెంట్ సమావేశంలో మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో అవసరమైన మెజారిటీ సాధించలేకపోయింది. దీంతో బిల్లు ఆమోదం పొందలేదు. ఈ నేపథ్యంలో మరోసారి బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకునేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇందుకోసం ప్రతిపక్ష పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

ప్రొరోగేషన్‌కు రాజ్యాంగంలో గడువు లేదు

పార్లమెంట్ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేసిన తర్వాత ఎన్ని రోజుల్లోగా అధికారికంగా ప్రొరోగ్ చేయాలనే విషయంపై రాజ్యాంగంలో నిర్దిష్ట గడువు లేదు. సాధారణంగా సభ నిరవధికంగా వాయిదా పడిన రెండు నుంచి నాలుగు



రోజుల్లో ప్రొరోగేషన్ ప్రక్రియ పూర్తవుతుందని పార్లమెంటరీ విధానాలు సూచిస్తున్నాయి. ప్రస్తుత సమావేశాలను పొడిగించాలన్నా, ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయాలన్నా సంబంధిత నిబంధనల ప్రకారం ముందస్తు నోటీసులు అవసరం. కొత్తగా సమావేశాలను ఏర్పాటు చేయడానికి కనీసం 14 రోజుల ముందుగా నోటీసు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. అయితే సమావేశాలు ఎక్కువకాలం ప్రొరోగ్ కాకుండా ఉన్నంత మాత్రాన అది రాజ్యాంగ విరుద్ధమని భావించలేము.

గతంలోనూ ఇలాంటి పరిణామాలు

భారత పార్లమెంట్ చరిత్రలో సభలు నిరవధికంగా వాయిదా పడిన తర్వాత కూడా ప్రొరోగేషన్ ఆలస్యమైన సందర్భాలు ఉన్నాయి.

2008: 87 రోజులు
1987: 76 రోజులు
1989: 54 రోజులు
2006: 49 రోజులు
2013: 49 రోజులు
1963: 41 రోజులు

2008లో అప్పటి యూపీఏ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానంపై చర్చించేందుకు జులై 21, 22 తేదీల్లో లోక్‌సభ సమావేశమైంది. అనంతరం సభను ప్రొరోగ్ చేయకుండా ఉంచారు. అక్టోబర్ 17న తిరిగి సమావేశమైన లోక్‌సభ, అక్టోబర్ 24న వాయిదా పడింది. డిసెంబర్ 10న మరోసారి సమావేశమైంది. ఈ క్రమంలో 87 రోజుల పాటు ప్రొరోగేషన్ జరగలేదు. తాజాగా ఆ రికార్డును ప్రస్తుత వర్షాకాల సమావేశాలు అధిగమించాయి.

కేంద్రంపై కాంగ్రెస్ విమర్శలు

పార్లమెంట్ సమావేశాలను ప్రొరోగ్ చేయకపోవడంపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. సాధారణంగా నిరవధిక వాయిదా తర్వాత రెండు నుంచి నాలుగు రోజుల్లోనే ప్రొరోగేషన్ ప్రక్రియ పూర్తవుతుందని గుర్తుచేసింది. డీలిమిటేషన్‌తో ముడిపడిన రాజ్యాంగ సవరణ బిల్లును మరోసారి ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకునేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందా? అని నిలదీసింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మూడింట రెండొంతుల మెజారిటీ కోసం ప్రయత్నిస్తున్నారా? అంటూ కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. మొత్తంగా పార్లమెంట్ సమావేశాల ప్రొరోగేషన్ జాప్యం, డీలిమిటేషన్ ప్రతిపాదనలు, మహిళా రిజర్వేషన్ల అమలు అంశాలు ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో చర్చకు దారితీశాయి.

ప్రధాని మోదీతో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కీలక ఫోన్ సంభాషణ

రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ సంక్షోభాన్ని కేవలం చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ సోమవారం సాయంత్రం ప్రధాని మోదీతో టెలిఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన వివరాలను భారత ప్రధాన మంత్రి కార్యాలయం అధికారికంగా విడుదల చేసింది. పీఎంఓ ప్రకటన ప్రకారం.. రష్యాతో నెలకొన్న ప్రస్తుత యుద్ధ పరిణామాలపై తన అభిప్రాయాలను అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రధాని మోదీతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారంలో భారత్ ఎల్లప్పుడూ అనుసరించే 'మానవతా దృక్పథాన్ని' పునరుద్ఘాటించారు. వివాదాలను కేవలం చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలనేది భారత్ యొక్క స్థిరమైన విధానమని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించేందుకు ఉద్దేశించిన అన్ని రకాల ప్రయత్నాలకు తమ వంతు సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని తెలిపారు. అలాగే, ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల దృష్ట్యా వివిధ రంగాలలో భారత్-ఉక్రెయిన్ ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై కూడా నేతలిద్దరూ చర్చించారు. మరోవైపు, ఈ ఫోన్ సంభాషణపై ఉక్రెయిన్ అధ్యక్ష కార్యాలయం కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. యుద్ధాన్ని ముగింపు దశకు తీసుకువచ్చేందుకు అవసరమైన దౌత్య ప్రక్రియలు, తదుపరి చర్యలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు పేర్కొంది. రాబోయే అబూదాబీ సమావేశ ఎజెండా కోసం ఉక్రెయిన్ సిద్ధమవుతోందని జెలెన్‌స్కీ తెలిపారు. ఉక్రెయిన్ ఎల్లప్పుడూ నిర్మాణాత్మక వైఖరితోనే ఉందని, రష్యా నుంచి కూడా యుద్ధ ఉద్రిక్తతలను తగ్గించే విధంగా అలాంటి చొరవే అవసరమని ఆయన పేర్కొన్నారు. "ఇది యుద్ధాన్ని కొనసాగించాల్సిన సమయం కాదు.. ముగించాల్సిన సమయం అని రష్యా నాయకత్వంతో సహా అందరికీ ప్రధాని మోదీ గతంలో పలుమార్లు స్పష్టంగా చెప్పారు. ఈ నేపథ్యంలో యుద్ధానికి ముగింపు పలికేలా భారత్ తన వంతుగా ఎలాంటి చర్యలు తీసుకోగలదో గుర్తించడం, ఇతర దేశాల నాయకులతో సంప్రదింపులు జరపడం ఎంతో కీలకం" అని జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. నల్ల సముద్రంలో నిలిచిపోయిన ధాన్యపు ఎగుమతులు, ఆహార భద్రత అంశంపై కూడా ఇరువురు నేతలు చర్చించారు. ఆహార రవాణా కారిడార్ల పునరుద్ధరణలో మధ్యవర్తిత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉందని, ఈ విషయంలో భారత్ చేసే ప్రయత్నాల కోసం తాము ఎదురుచూస్తున్నామని ఉక్రెయిన్ తెలిపింది. సముద్ర మార్గాలను అడ్డుకోవడం వల్ల రష్యా ఆర్థిక వ్యవస్థతో పాటు వివిధ దేశాల్లోని కోట్లాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జెలెన్‌స్కీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల అట్లాంటాలో జరిగిన జీ20 విదేశాంగ మంత్రుల సదస్సు సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మాట్లాడుతూ, ఈ సంక్షోభ పరిష్కారం కోసం భారత్ నిరంతరం ప్రయత్నిస్తోందని వెల్లడించారు. పౌర నౌకలు మరియు నావికులపై దాడులు జరగకుండా చూడటం, నల్ల సముద్రం ద్వారా ధాన్యపు ఎగుమతులను పునరుద్ధరించడం, అలాగే ఇంధన మౌలిక వసతులపై దాడులు జరగకుండా చూడటం అనే మూడు ప్రధాన అంశాలపై భారత్ రష్యా, ఉక్రెయిన్ మరియు యూరప్ దేశాలతో చర్చిస్తోందని తెలిపారు.

ఎర్రకోట పేలుడు తర్వాత ఉగ్రవాదంపై ఉక్కుపాదం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోట వద్ద కారు బాంబు పేలుడు జరిగి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో కేంద్ర భద్రతా సంస్థలు దేశవ్యాప్తంగా నిఘాను మరింత కట్టుదిట్టం చేశాయి. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా నివారణ చర్యలను ముమ్మరం చేశాయి. గత ఏడాది కాలంలో సరిహద్దులకు అవతల నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రవాద నెట్‌వర్క్‌లపై భద్రతా దళాలు విస్తృతంగా దాడులు నిర్వహించాయి. ఈ క్రమంలో 300 మందికి పైగా ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధం ఉన్నవారిని అరెస్టు చేయగా, విదేశాల్లో తలదాచుకున్న 73 మంది మోస్ట్ వాంటెడ్ నిందితులను భారత్‌కు తీసుకొచ్చినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఎర్రకోట పేలుడు నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి దాడులను అడ్డుకునేందుకు కేంద్ర నిఘా సంస్థలు ప్రత్యేక కార్యాచరణను రూపొందించాయి. ఇందులో భాగంగా ఫిబ్రవరి 23న 'ప్రహార్: జాతీయ ఉగ్రవాద నిరోధక విధానం, వ్యూహం' ను ప్రవేశపెట్టాయి. ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తామని 2026 సెప్టెంబర్‌లో జరిగిన రాష్ట్రాల డీజీపీలు, కేంద్ర భద్రతా సంస్థల అధిపతుల ఉన్నతస్థాయి సమావేశంలో స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ వ్యూహంలో భాగంగా పాకిస్తాన్ ఐఎస్ఐ మద్దతు ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 'షహజాద్ భట్టి నెట్‌వర్క్'పై దేశవ్యాప్తంగా దాడులు నిర్వహించారు. ఈ ఆపరేషన్లలో 100కు పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 300 మందికి పైగా కార్యకర్తలను అరెస్టు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్‌లు పాకిస్తాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ గుర్తులున్న హ్యాండ్ గ్రెనేడ్లు, అక్రమ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 26న చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం కింద గాదీచీను ఉగ్రవాద సంస్థగా కేంద్రం ప్రకటించినట్లు పేర్కొన్నారు.

విదేశాల నుంచి 73 మంది నిందితుల అప్పగింత

ఉగ్రవాదులకు విదేశాల్లో ఆశ్రయం లభించకుండా కేంద్రం దౌత్యపరమైన చర్యలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రత్యేక 'ఎక్స్‌ట్రాడిషన్ పోర్టల్'ను ప్రారంభించింది. గత ఏడాది కాలంలో వివిధ దేశాల నుంచి 73 మంది కీలక ఉగ్రవాద నిందితులను భారత్‌కు తీసుకొచ్చినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

పేలుడు పదార్థాల విక్రయాలపై నిఘా

బాంబుల తయారీలో ఉపయోగించే అమ్మోనియం నైట్రేట్ విక్రయాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. యువతలో ఉగ్రవాద భావజాలం వైపు మొగ్గుచూపే సంకేతాలు, ప్రవర్తనలో వచ్చే మార్పులపై కూడా నిరంతరం నిఘా ఉంచుతున్నట్లు వెల్లడించారు. "ఎర్రకోట పేలుడు కేసు ప్రత్యేకమైనది. ఇందులో అత్యంత అర్హత కలిగిన నిపుణులు పాలుపంచుకున్నారు. ప్రస్తుతం అమ్మోనియం నైట్రేట్, ఇతర పదార్థాల విక్రయాలపై ఆకస్మిక తనిఖీలతో పాటు పలు నియంత్రణ చర్యలు అమల్లో ఉన్నాయి" అని ఓ అధికారి పేర్కొన్నారు.

పలు ఉగ్రవాద మాడ్యూళ్ల నిర్వీర్యం

కేంద్ర భద్రతా సంస్థలు దేశవ్యాప్తంగా పలు ఆపరేషన్లు నిర్వహించి ఉగ్రవాద మాడ్యూళ్లను నిర్వీర్యం చేసినట్లు తెలిపాయి. జైష్-ఎ-మొహమ్మద్ (జేవీవీ), లష్కరే-తైబా (గామ) వంటి నిషేధిత సంస్థలకు మద్దతుగా పనిచేస్తున్న వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఖలిస్థాన్ అనుకూల శక్తులపై కూడా చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్, ఖలిస్థాన్ జిందాబాద్ ఫోర్స్ వంటి సంస్థల నెట్‌వర్క్‌లను దెబ్బతీసినట్లు పేర్కొన్నారు. ఈ చర్యలతో సరిహద్దుల గుండా జరిగే ఆయుధాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటంతో పాటు, పలువురు కీలక వ్యక్తులు అరెస్టయ్యారని తెలిపారు. బంగ్లాదేశ్ కేంద్రంగా ఉన్న ఉగ్రవాద ముప్పులపైనా నిఘా పెంచారు. అసోం, పశ్చిమబెంగాల్, త్రిపుర, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో జమాత్-ఉల్-ముజాహిదీన్ బంగ్లాదేశ్ (జేవీడీ) భావజాలంతో ప్రభావితమైన 27 మంది కార్యకర్తలను అరెస్టు చేసినట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి.

పదేళ్లలోనే పెను మార్పు..

భారత్‌పై ప్రపంచ బ్యాంకు ప్రశంసలు

భారత్‌లో గత దశాబ్ద కాలంలో పేదరికం గణనీయంగా తగ్గిందని ప్రపంచ బ్యాంకు ప్రశంసించింది. ఈ విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు భారత్ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవచ్చని ఓ నివేదిక వెల్లడించింది. 2011లో దేశంలో అత్యంత పేదరికంలో ఉన్నవారి సంఖ్య 27.1 శాతంగా ఉండగా.. 2023 నాటికి అది 2.6 శాతానికి తగ్గినట్లు ప్రపంచ బ్యాంకు గణాంకాలు చెబుతున్నాయి. 'ది బిజినెస్ స్టాండర్డ్' ప్రచురించిన నివేదిక ప్రకారం.. భారత్ దాదాపు 49.6 కోట్ల మందిని తీవ్ర పేదరికం నుంచి బయటపడేసింది. అమెరికా, రష్యా దేశాల మొత్తం జనాభా కంటే ఇది ఎక్కువ. ప్రపంచంలో పేదరికం అత్యంత వేగంగా తగ్గిన దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచిందని నివేదిక పేర్కొంది. రోజుకు 4.2 డాలర్ల ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకునే దిగువ మధ్య ఆదాయ దేశాల పేదరిక ప్రమాణం ప్రకారం కూడా భారత్‌లో పేదరికం 2011లో 57.7 శాతం ఉండగా.. 2023 నాటికి 16.1 శాతానికి తగ్గింది. అయితే పేదరికాన్ని కొలిచే విధానాల్లో వచ్చిన మార్పులు కూడా ఈ గణాంకాలపై కొంత ప్రభావం చూపి ఉండొచ్చని ప్రపంచ బ్యాంకు స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా పేదరికం తగ్గుదల ఒకేలా లేదని నివేదిక తెలిపింది. ఉత్తరప్రదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్ వరకు ఉన్న ప్రాంతంలోనే దేశంలోని పేదల్లో 57 శాతం మంది నివసిస్తున్నట్లు వెల్లడించింది.

అభివృద్ధికి ప్రజామోదమే ఈ విజయం

-మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. రాజకీయాల్లో నూతన ఒరవడికి శ్రీకారం చుడుతూ కూటమిగా కలిసి పనిచేశామని, అన్ని జిల్లాల్లోనూ ప్రజలు తమకు మద్దతు పలికారని తెలిపారు. అనకాపల్లి, కోనసీమ, కాకినాడ, పల్నాడు, పశ్చిమగోదావరి, విశాఖ జిల్లాల్లో వైఎస్సార్సీపీకి ప్రజా మద్దతు లభించలేదని వ్యాఖ్యానించారు. విధ్వంస పాలన నుంచి రాష్ట్రాన్ని పునరుద్ధరించే లక్ష్యంతో స్వర్ణాంధ్ర విజన్‌ను రూపొందించి అభివృద్ధి, సుపరిపాలన కోసం కృషి చేస్తున్నామని వివరించారు.

2024తో పోలిస్తే పెరిగిన ప్రజాదరణ

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజాదరణ పెరిగిందని ఓట్ల శాతమే స్పష్టం చేస్తోందని చంద్రబాబు తెలిపారు. పట్టణ, పరిషత్ ఎన్నికల్లో కలిపి కూటమి 58.9 శాతం ఓట్లు సాధించిందని వెల్లడించారు. 2024 ఎన్నికల్లో వచ్చిన 55.3 శాతం ఓట్లతో పోలిస్తే ఆదరణ పెరిగిందని వివరించారు. స్థానిక ఎన్నికల్లో కూటమికి, వైఎస్సార్సీపీకి మధ్య ఓట్ల శాతంలో 25.34 శాతం వ్యత్యాసం ఉందన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఎన్డీఏకు 59.9 శాతం, వైఎస్సార్సీపీకి 34.3 శాతం ఓట్లు వచ్చాయని, కూటమి స్ట్రైక్ రేట్ 94 శాతంగా నమోదైందని చెప్పారు. జడ్పీటీసీ ఎన్నికల్లో ఎన్డీఏ 57.6 శాతం, వైఎస్సార్సీపీ 39.7 శాతం ఓట్లు సాధించాయని తెలిపారు. పట్టణాల్లో కూటమి, వైఎస్సార్సీపీ మధ్య ఓట్ల శాతం వ్యత్యాసం 25.60 శాతం కాగా, గ్రామీణ ప్రాంతాల్లో 17.9 శాతంగా ఉందన్నారు. మొత్తం 9,818 ఎంపీటీసీ స్థానాలకు గానూ కూటమి 7,803 స్థానాలను గెలుచుకుందని, రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం మండల అధ్యక్ష స్థానాలను దక్కించుకుందని వెల్లడించారు.

27 జిల్లాల్లో కూటమి ఆధిక్యం

మొత్తం 659 జడ్పీటీసీ స్థానాలకు గానూ కూటమి 575 స్థానాలను గెలుచుకుందని చంద్రబాబు తెలిపారు. 28 జిల్లాల్లో 27 చోట్ల ఆధిక్యత సాధించిందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాత్రమే వైఎస్సార్సీపీ కూటమి కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకుందని చెప్పారు. ఏడు జిల్లాల్లో వైఎస్సార్సీపీకి ఒక్క జడ్పీటీసీ స్థానం కూడా దక్కలేదని వివరించారు. పట్టణాల్లో ఎన్డీఏకు 65.7 శాతం, వైఎస్సార్సీపీకి 27.42 శాతం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వచ్చాయని తెలిపారు. పరిషత్ ఎన్నికల్లో కూటమికి 62.83 శాతం, వైఎస్సార్సీపీకి 31.46 శాతం ఓట్లు వచ్చినట్లు పేర్కొన్నారు. అనకాపల్లి, కోనసీమ, కాకినాడ, మార్కాపురం, పల్నాడు, పశ్చిమగోదావరి, విశాఖ జిల్లాల్లో వైఎస్సార్సీపీ ఖాతా తెరవలేదని చంద్రబాబు వెల్లడించారు.

పెట్టుబడులు, అభివృద్ధికి ప్రాధాన్యం

పెట్టుబడులను ఆకర్షించేలా ఎస్ఐపీబీ, కేబినెట్ సమావేశాల ద్వారా వేగంగా అనుమతులు మంజూరు చేశామని చంద్రబాబు తెలిపారు. వివిధ శాఖల ప్రగతి నివేదికలను ప్రజల ముందు ఉంచామని చెప్పారు. రాయలసీమను అభివృద్ధి సీమగా మార్చే లక్ష్యంతో నీటిని అందించడంతో పాటు పరిశ్రమలను తీసుకొస్తున్నామని వివరించారు. సూపర్ ఎల్‌నినో వంటి తీవ్ర కరవు పరిస్థితుల్లోనూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కరవు, కోస్తాంధ్రలో తుపాన్ల వంటి ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనప్పటికీ సాంకేతిక పరిజ్ఞానంతో ముందస్తు అంచనాలు వేసి ప్రజలకు హెచ్చరికలు జారీ చేశామని చెప్పారు. ప్రజలకు కష్టం వచ్చినప్పుడు ప్రభుత్వం అండగా నిలిచిందని, అందుకే ఎన్నికల్లో ప్రజలు కూటమికి మద్దతు పలికారని పేర్కొన్నారు.

మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం

టీడీపీ తరఫున మేయర్లు, చైర్‌పర్సన్లుగా గెలిచిన 70 మందిలో 55 మంది డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగినవారని చంద్రబాబు తెలిపారు. వీరిలో 42 మంది మహిళలు ఉండగా, 44 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందినవారని చెప్పారు. టీడీపీ గెలుచుకున్న పది మేయర్ పదవుల్లో ఎనిమిది మంది మహిళలే ఉన్నారని వివరించారు. రాజకీయాల్లో తాము చేసిన ప్రయోగాలు మంచి ఫలితాలనిచ్చాయని, ఈ నాయకత్వం భవిష్యత్తులో మరో 30 ఏళ్లకు సరిపడే నాయకులను అందిస్తుందని అన్నారు.

పట్టణ స్థానిక సంస్థల్లో కూటమి హవా

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభంజనం సృష్టించిందని చంద్రబాబు తెలిపారు. 100 స్థానాలకు గానూ 94 చోట్ల విజయం సాధించి, 82 శాతం వార్డులను కైవసం చేసుకుందని వెల్లడించారు. మొత్తం 3,941 వార్డుల్లో 3,233 స్థానాలను గెలుచుకున్నామని, 13 మేయర్ పదవులకు గానూ 12, 87 చైర్‌పర్సన్ పదవులకు గానూ 82 దక్కించుకున్నామని చెప్పారు. టీడీపీ 70, జనసేన 20, బీజేపీ నాలుగు చొప్పున మేయర్, చైర్‌పర్సన్ పదవులను సాధించాయని వివరించారు. 100 పట్టణ స్థానిక సంస్థల్లో 95 చోట్ల కౌన్సిల్ మెజారిటీ సాధించామని, 16 పట్టణ స్థానిక సంస్థల్లో అన్ని వార్డులనూ కూటమి గెలుచుకుందని తెలిపారు. అనంతపురం మేయర్ అభ్యర్థి ఓడిపోయినప్పటికీ కార్పొరేటర్లలో కూటమి బలం ఎక్కువగా ఉందని పేర్కొన్నారు.

పులివెందులలోనూ కూటమి విజయధంకా

విశాఖలో 2,47,817, విజయవాడలో 1,30,872, గుంటూరులో 96,294 ఓట్ల మెజారిటీ సాధించామని చంద్రబాబు వెల్లడించారు. వైఎస్సార్సీపీ 100 పట్టణ స్థానిక సంస్థలకు గానూ కేవలం నాలుగు చోట్లే గెలిచిందని, 13 మేయర్ పదవుల్లో ఒక్కటి మాత్రమే దక్కించుకుందని చెప్పారు. మొత్తం 3,941 వార్డుల్లో 558 స్థానాలకే పరిమితమైందని, 22 పట్టణ స్థానిక సంస్థల్లో ఒక్క వార్డును కూడా గెలుచుకోలేకపోయిందని తెలిపారు. పులివెందులలో కూటమి 13,875 ఓట్ల మెజారిటీతో చైర్‌పర్సన్ పదవిని దక్కించుకుందని, 40 వార్డులకు గానూ 37 స్థానాలను గెలుచుకుందని వివరించారు. ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛగా ఎన్నికలు జరగడం వల్లే ఈ ఫలితాలు వచ్చాయని అన్నారు. కడప జిల్లాలో రౌడీ రాజకీయం అంతమైందని, అక్కడి తొమ్మిది పట్టణ స్థానిక సంస్థలూ కూటమి ఖాతాలో చేరాయని వ్యాఖ్యానించారు.

యాక్సెస్ ఈక్వాలిటీ ఇండెక్స్‌లో ఏపీకి రెండో స్థానం

ప్రతి ప్రాంతానికి, ప్రతి వర్గానికీ అభివృద్ధి ఫలాలు అందుతున్నాయనడానికి యాక్సెస్ ఈక్వాలిటీ ఇండెక్స్‌లో ఏపీ సాధించిన స్థానమే నిదర్శనమని చంద్రబాబు తెలిపారు. 2026 సూచీలో 28 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచిందన్నారు. జీవన ప్రమాణాలు, సామాజిక-ఆర్థిక భద్రత, మౌలిక వసతులు, విద్య, వైద్యం వంటి రంగాల్లో ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందుతున్నాయని వివరించారు. కుటుంబ స్థాయి నుంచి కమ్యూనిటీ ఆస్తుల వరకు పరిశుభ్రమైన గ్రామాలు, పట్టణాల నిర్మాణంలో ఏపీ ముందంజలో ఉందన్నారు.

వైఎస్సార్సీపీ హింసాత్మక రాజకీయాలపై విమర్శలు

హింస, దాడులు, హిట్ అండ్ రన్ రాజకీయాలతో ప్రజాతీర్పును మార్చలేరని చంద్రబాబు వైఎస్సార్సీపీపై విమర్శలు గుప్పించారు. 'గొడ్డలి పార్టీ' రాజకీయాలకు కాలం చెల్లిందని వ్యాఖ్యానించారు. విశాఖకు తమ ప్రభుత్వం అభివృద్ధి వెలుగులు తీసుకొస్తే, మేయర్ స్థానంలో 2.50 లక్షల ఓట్ల మెజారిటీతో ప్రజలు కూటమిని గెలిపించారని అన్నారు. ప్రజల కోసం కష్టపడే పార్టీల వెంటే ప్రజలు ఉంటారని ఈ ఎన్నికలతో మరోసారి నిరూపితమైందని చెప్పారు. కీలకమైన స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు వైఎస్సార్సీపీ అన్ని విధాలా ప్రయత్నించిందని చంద్రబాబు ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్ఐఆర్ ప్రక్రియ, డీలిమిటేషన్‌పై పిటిషన్లు వేసిందని, అయితే సుప్రీంకోర్టు వారి ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసిందని పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ నేరాలు, ఘోరాలు, హింసాత్మక రాజకీయాలనే నమ్ముకుందని విమర్శించారు. రౌడీ రాజకీయాలు, డ్రామాలతో ప్రజాతీర్పును మార్చలేరని అన్నారు. రెండు తుపాన్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ వైఎస్సార్సీపీ కనీసం రాజకీయ పార్టీగా స్పందించలేదని చంద్రబాబు విమర్శించారు. తాము ఎన్నికల కంటే తుపాన్లు, ప్రజా సమస్యలపైనే ఎక్కువ దృష్టి పెట్టి పనిచేశామని తెలిపారు. ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలనే ఉద్దేశంతోనే ఓటర్లు కూటమికి మద్దతు పలికారని చెప్పారు. రాజకీయ పార్టీలకు ప్రజల దీవెనల కంటే గొప్ప బహుమతి మరొకటి ఉండదని వ్యాఖ్యానించారు.

ఏపీ సీపీఎస్ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..

-మొదటిపేజీ తరువాయి

మార్గదర్శకాలను రూపొందించారు.

ఎవరెవరికి అవకాశం?

ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం.. 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు ఉద్యోగ నియామక నోటిఫికేషన్ విడుదలై, ఆ తర్వాత నియామకం పొంది ప్రస్తుతం సీపీఎస్ పరిధిలో ఉన్న ఉద్యోగులు ఓపీఎస్‌ను ఎంచుకోవడానికి అర్హులు. అంటే నోటిఫికేషన్ తేదీ 2004 సెప్టెంబర్ 1 కంటే ముందుండి, నియామకం ఆ తేదీన లేదా ఆ తర్వాత జరిగిన ఉద్యోగులకు ఈ అవకాశం వర్తిస్తుంది. ప్రస్తుతం విధుల్లో కొనసాగుతున్న అర్హులైన ఉద్యోగులతో పాటు, ఇప్పటికే పదవీ విరమణ చేసినవారు, ఫ్యామిలీ పెన్షన్ పొందుతున్న అర్హులైన లబ్ధిదారులు కూడా ఈ ఒక్కసారి ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఇందుకోసం అర్హులైన వారు 2026 డిసెంబర్ 31లోగా తమ ఐచ్ఛికాలను సమర్పించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

కేంద్ర మార్గదర్శకాల ఆధారంగా నిర్ణయం

కేంద్ర ప్రభుత్వ పరిధిలో నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) అమల్లోకి రాకముందే నియామక ప్రక్రియ ప్రారంభమైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని ఎంచుకునే అవకాశం కల్పిస్తూ కేంద్ర పెన్షన్లు, పెన్షనర్ల సంక్షేమ శాఖ 2020--2023 మధ్య పలు కార్యాలయ మెమోరాండంలను జారీ చేసింది. అదే విధానాన్ని అనుసరిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఈ ప్రయోజనాన్ని కల్పిస్తున్నట్లు జీవోలో పేర్కొన్నారు.

దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక ఆదేశాలు

ఈ ప్రక్రియను పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించాలని ఆర్థికశాఖ స్పష్టం చేసింది. సంబంధిత నియామక అధికారులు, కార్యాలయ అధిపతులు అందిన దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా పరిశీలించాలని ఆదేశించింది. అవసరమైన రికార్డులను పక్కాగా నిర్వహించి, అర్హతలను నిర్ధారించాలని సూచించింది. సచివాలయ విభాగాలు, హెచ్ఓడీలు, ట్రెజరీ అధికారులు ఈ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. నిర్ణీత గడువులోగా అర్హులైన ఉద్యోగుల పెన్షన్ ప్రయోజనాలను ఖరారు చేయాలని స్పష్టం చేసింది. జీవోకు సంబంధించిన పూర్తి వివరాలను రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చని ఆర్థికశాఖ తెలిపింది.

ఏపీఎండీసీకి ప్రభుత్వం భారీ ఊరట..

-మొదటిపేజీ తరువాయి

ఈ నిర్ణయం తీసుకుంది. తాజా ఉత్తర్వులతో ఏపీఎండీసీకి ఉన్న మొత్తం రుణ గ్యారంటీ పరిమితి రూ.906.52 కోట్ల నుంచి రూ.1,021.52 కోట్లకు పెరిగింది.

గతంలో రూ.906.52 కోట్లకు అనుమతి

2025 ఏప్రిల్‌లో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. వాణిజ్య బ్యాంకులు, ఆర్థిక సంస్థలు లేదా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నుంచి నాన్-ఫండ్ ఆధారిత పరిమితుల కింద రూ.906.52 కోట్ల వరకు రుణ సదుపాయం పొందేందుకు ఏపీఎండీసీకి ప్రభుత్వం అనుమతిచ్చింది. తాజాగా సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (వీసీ అండ్ ఎండీ) సమర్పించిన ఈ-ఫైల్ ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం మరో రూ.115 కోట్ల గ్యారంటీని మంజూరు చేసింది.

అసలు, వడ్డీకి ప్రభుత్వ గ్యారంటీ

ఈ గ్యారంటీ రుణం పూర్తి కాలానికి వర్తించనుంది. రుణ అసలుతో పాటు వడ్డీ చెల్లింపులకు కూడా ప్రభుత్వ హామీ ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అయితే రుణం, వడ్డీ చెల్లింపుల బాధ్యత పూర్తిగా ఏపీఎండీసీదేనని ప్రభుత్వం పేర్కొంది.

5 శాతం గ్యారంటీ కమిషన్

రుణాన్ని ముందస్తుగా చెల్లించే అవకాశం ఉండేలా ఆర్థిక సంస్థలతో కుదుర్చుకునే ఒప్పందాల్లో జీరో ఫోర్‌క్లోజర్ ఛార్జీల నిబంధన ఉండేలా చూసుకోవాలని ఏపీఎండీసీకి సూచించింది. ప్రభుత్వం కల్పించిన గ్యారంటీపై సంస్థ ఏటా 5 శాతం చొప్పున గ్యారంటీ కమిషన్‌ను ప్రభుత్వానికి చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయంతో బొగ్గు గనుల వేలంలో పాల్గొనేందుకు ఏపీఎండీసీకి అదనపు ఆర్థిక బలం చేకూరనుంది.

ఏపీలో వరుస ఎన్నికలు...

విజయవాడ : ఏపీలో వరసగా ఎన్నికలు జరుగుతున్నాయి. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ఇప్పటికే ముగిశాయి. దీంతో ప్రభుత్వం మిగతా పంచాయతీ, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు కసరత్తు ప్రారంభమైంది. ఈ మేరకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఎన్నికలు ఒకే విడతలో జరగనున్నాయి. ఈ ఎన్నికలపై రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ అధికారులు స్పష్టమైన గైడ్‌లైన్స్‌ను కూడా ఇవ్వడం జరిగింది.ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సందడి నెలకొంది. ముందు మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు జరగ్గా.. తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు విజయవంతంగా ముగిశాయి. వీటికి సంబంధించిన ఫలితాలు కూడా వచ్చేశాయ్. దీంతో మిగిలిన ఎన్నికలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ని ఖరారు అయింది. ఇక ప్రాథమి వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఈ ఎలక్షన్‌ని ఒకే విడతలో నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఎ.బాబు శనివారం జిల్లా సహకార అధికారులకు స్పష్టమైన గైడ్‌లైన్స్‌ను జారీ చేశారు.అలాగే ఈ ఎలక్షన్ పనుల్లో ఎలాంటి ఆలస్యం, నిర్లక్ష్యం సహించేది లేదని కమిషనర్ తెలిపారు. కిందిస్థాయి అధికారులకు, ఎంప్లాయీస్‌కి ఎన్నికల నిర్వహిణతో పాటు చట్టపరంగా ఉన్న నిబంధనలపై కూడా అవగాహన కల్పించాలని సూచించారు. అంతేకాదు ఆదేశాలు అందిన పది రోజుల్లోగా వెంటనే సంబంధిత కార్యాచరణపై రిపోర్ట్ అందించాలని తెలియజేశారు. దీంతోపాటు రైతు సేవా కేంద్రాల వారీగా ప్రాథమిక ఓటర్ల లిస్ట్‌లను రెడీ చేసి, 'ఈ-పీఏసీఎస్ ఈఆర్‌పీ' పోర్టల్లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించడం జరిగింది. అదేవిధంగా ఓటర్లకు అనుకూలంగా ఉండే పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ముందుగానే అంచనాకు రావాలని సూచించడం జరిగింది.ఈ కోపరేటివ్ సోసైటీ ఎన్నికలు ఒకే విడతలో జరగనున్నాయి. కాబట్టి దీనికి తగ్గట్టుగా బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి, ప్రింటింగ్ ప్రెస్‌ల లభ్యతపై ముందస్తు ప్లాన్ చేసుకోవాలని కమిషన్ సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌లను గుర్తించి, చట్టపరమైన విషయాలపై పట్టున్న అధికారులను నియమించాలని చెప్పారు. దీంతోపాటు పోలింగ్ సిబ్బంది, జోనల్ అధికారులకు ట్రైనింగ్ ఇవ్వాలని, ఇతర శాఖల ఉద్యోగుల వివరాలను సేకరించాలని కూడా సూచించారు. ఎన్నికల నిర్వహణకయ్యే ఖర్చులను అంచనా వేయాలని అలాగే శాంతిభద్రతల ఏర్పాట్లను పర్యవేక్షించాలని సంబంధిత మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు. కాగా ఇప్పటికే రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ ఖరారైంది. ఆ ఎన్నికలు వచ్చే నెల మొదటి వారంలోనే పూర్తి కానున్నాయి.

గ్రామాల్లో సందడి

రాష్ట్రంలో 13 వేల 219 పంచాయతీలకు పోలింగ్, కౌంటింగ్ నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ సిద్ధమైంది. ఈ నెల 13వ తేదీన ఎన్నికల షెడ్యూల్2ని అధికారికంగా రిలీజ్ చేయనున్నట్టు రాజ్ఞఅ ప్రకటించింది. దీంతో మళ్లీ పొలిటికల్ హీట్ ఎక్కింది.పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో జరగనున్నాయి. ఈ మేరకు నవంబర్ 13న మొదటి దశ, 16న రెండో దశ, 19వ తేదీన మూడో దశకు నోటిఫికేషన్లను జారీ చేయనున్నారు. తొలివిడతలో భాగంగా నోటిఫికేషన్ 13న విడుదలైతే.. నవంబర్ 17వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుంది. నవంబర్ 26న పోలింగ్ నిర్వహించి.. ఫలితాలను వెల్లడించడం జరుగుతుంది. రెండో విడతలో భాగంగా 16న నోటిఫికేషన్ రిలీజ్ చేస్తారు. నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ నవంబర్ 20. ఇక నవంబర్ 29న పోలింగ్, ఫలితాలు వెల్లడిస్తారు. అలాగే మూడో విడత నోటిఫికేషన్ 19న విడుదల కాగా.. నవంబర్ 23 వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుంది. ఫైనల్ పోలింగ్, ఫలితాలను డిసెంబర్ 2వ తేదీన వెల్లడించడం జరుగుతుంది.రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు చాలా కీలకంగానే ఉంటాయి. గ్రామాల్లో ఈ ఎన్నికల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తికరంగా ఉంటారు. ఈ పంచాయతీ ఎన్నికలు అధికారికంగా పార్టీల గుర్తులపై జరగకపోయినా.. కూటమి, వైసీపీ మద్దతుదారుల మధ్యే పోటీ తీవ్రంగా ఉంటుంది. రాష్ట్రంలో కొత్త గవర్నమెంట్ ఏర్పాటైన తర్వాత జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో అధికార, ప్రతిపక్షాలకు ఇవి అత్యంత కీలకం కానున్నాయి. మొత్తానికి పల్లె పోరుకు సిద్ధమైంది.

వాయిదాల వలయంలో కృష్ణా, గోదావరి బోర్డులు!

-మొదటిపేజీ తరువాయి

(జీఆర్ఎంబీ) సమావేశం కూడా పలుమార్లు వాయిదా పడింది. దీంతో రెండు నదులకు సంబంధించిన కీలక అంశాలపై చర్చలు ముందుకు సాగడం లేదు.

వాయిదాల వలయంలో సమావేశాలు

రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ, ప్రాజెక్టుల నిర్వహణ, టెలిమెట్రీ వ్యవస్థల ఏర్పాటు వంటి కీలక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించాల్సిన బోర్డుల సమావేశాలే నిర్వహణకు నోచుకోవడం లేదు. భేటీల నిర్వహణకు నిర్ణయాలు తీసుకుంటున్నా, వివిధ కారణాలతో వాయిదాలు పడుతుండటంతో జల వివాదాలపై అనిశ్చితి కొనసాగుతోంది.

ఆరుసార్లు వాయిదా పడిన కేఆర్ఎంబీ భేటీ

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు 21వ సమావేశం నిర్వహణలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. తొలుత మే నెలలో నిర్వహించాలని నిర్ణయించిన ఈ సమావేశం ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం కారణంగా వాయిదా పడింది. అనంతరం ఆగస్టు, అక్టోబర్ నెలల్లో నిర్వహించాల్సిన భేటీలు కూడా జరగలేదు. అక్టోబర్ 26న సమావేశం జరగాల్సి ఉండగా, తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణ అంశంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రితో రాష్ట్ర ప్రభుత్వ సమావేశం ఉన్నందున వాయిదా పడింది. మరుసటి రోజు నిర్వహించాల్సిన భేటీ కూడా జరగలేదు. ఆ తర్వాత నవంబర్ 5న జరగాల్సిన సమావేశం సైతం వాయిదా పడింది. మురసు తుపాను ప్రభావంతో అధికారులు సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నందున సమావేశాన్ని వాయిదా వేయాలని ఏపీ కోరగా, బోర్డు అంగీకరించింది. ఇలా కేఆర్ఎంబీ 21వ సమావేశం ఆరుసార్లు వాయిదా పడినట్లు సమాచారం.

పూర్తిస్థాయి భేటీకి 22 నెలల విరామం

కృష్ణా బోర్డు పూర్తిస్థాయి సమావేశం చివరిసారిగా 2025 జనవరి 21న జరిగింది. అదే ఏడాది జూన్ 27న ఉద్యోగుల వేతనాల రికవరీకి సంబంధించి హైకోర్టు తీర్పుపై చర్చించేందుకు ప్రత్యేక సమావేశం మాత్రమే నిర్వహించారు. అయితే అది పూర్తిస్థాయి సమావేశం కాదు. దీంతో కీలక జల సమస్యలపై సమగ్రంగా చర్చించేందుకు బోర్డు భేటీ జరగక చాలాకాలం గడిచింది.

20 నెలలుగా జీఆర్ఎంబీ సమావేశం లేదు

కృష్ణా బోర్డు తరహాలోనే గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశాలు కూడా వాయిదాల బాట పట్టాయి. జీఆర్ఎంబీ



18వ సమావేశాన్ని తొలుత ఆగస్టు 18న నిర్వహించాలని నిర్ణయించారు. అయితే తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలు వ్యక్తం చేయడం, అజెండా అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు తలెత్తడంతో సమావేశం వాయిదా పడింది. ఆ తర్వాత అక్టోబర్ 30న నిర్వహించాల్సిన భేటీ కూడా మరోసారి వాయిదా పడింది.

జీఆర్ఎంబీ సమావేశం చివరిసారిగా 2025 ఏప్రిల్ 7న జరిగింది. ఆ తర్వాత ఇప్పటివరకు మరో సమావేశం నిర్వహించలేదు. గోదావరి బోర్డు పరిధిలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను చర్చించాలన్న ఏపీ ప్రతిపాదనలపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో సమావేశం నిర్వహణలో జాప్యం కొనసాగుతోంది.

ప్రాజెక్టులపై రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాలు

ఇప్పటికే కేంద్ర జల సంఘం, సాంకేతిక సలహా మండలి అనుమతులు పొందిన ప్రాజెక్టులను తిరిగి చర్చించడం సమంజసం కాదన్నది తెలంగాణ వాదన. మరోవైపు, గోదావరి బోర్డు పరిధిలోని ప్రాజెక్టుల అంశాలను అజెండాలో చేర్చాలని ఏపీ కోరుతోంది. ఈ అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో చర్చలు ముందుకు సాగడం లేదు. కృష్ణా బోర్డు పరిధిలోనూ నీటి పంపిణీ, ప్రాజెక్టుల వారీగా నీటి వినియోగం, టెలిమెట్రీ వ్యవస్థల ఏర్పాటు వంటి అంశాలపై విభేదాలు కొనసాగుతున్నాయి. తెలంగాణకు సంబంధించిన అభ్యంతరాలు, డిమాండ్లను బోర్డు సమావేశాల్లో చర్చించి పరిష్కరించాల్సి ఉంది. అయితే సమావేశాల నిర్వహణలో జాప్యం కారణంగా కీలక అంశాలపై చర్చలు, నిర్ణయాలు వాయిదా పడుతున్నాయి. రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారం కోసం బోర్డుల భేటీలు ఎప్పుడు జరుగుతాయన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

పరిషత్ ఎన్నికల్లో అంచనాలు తారుమారు...

నెల్లూరు : ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు కూటమి పార్టీలకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చాయి. మున్సిపల్ ఎన్నికల్లో కనిపించిన ఆధిపత్యం పరిషత్ ఎన్నికల్లోనూ కొనసాగడంతో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. ఉత్తరాంధ్ర నుంచి కోస్తాంధ్ర వరకు, గోదావరి జిల్లాల నుంచి రాయలసీమ వరకు కూటమి అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో విజయం సాధించారు. అధికారికంగా పార్టీ తరఫున బరిలో నిలిచిన అభ్యర్థులతో పాటు టికెట్లు దక్కక స్వతంత్రులుగా పోటీ చేసిన కూటమి నాయకులు కూడా గెలవడం ఈ ఎన్నికల్లో ప్రత్యేకంగా కనిపించింది.సాధారణంగా ఒకే పార్టీకి చెందిన ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉంటే ఓట్లు చీలిపోయి ప్రత్యర్థి పార్టీకి ప్రయోజనం కలుగుతుందని రాజకీయ వర్గాలు భావిస్తుంటాయి. ఈ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి తమకు అనుకూలిస్తుందని వైసీపీ నాయకత్వం ఆశించి ఉండవచ్చు. అయితే ఫలితాలు మాత్రం అందుకు భిన్నంగా వచ్చాయి. అధికారిక అభ్యర్థితో పాటు రెబల్‌గా పోటీ చేసిన నాయకుల్లో ఒకరిని ఓటర్లు ఆదరించారు. కొన్ని ప్రాంతాల్లో ఇద్దరు కూటమి అభ్యర్థుల మధ్య పోటీ ఉన్నప్పటికీ వైసీపీకి ఆశించిన స్థాయిలో ప్రయోజనం దక్కలేదు.నెల్లూరు జిల్లాలోని ఇందుకూరుపేట, జలదంకి, ఆత్మకూరు, వెంకటాచలం మండలాల్లో ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. వీరంతా తెలుగుదేశం పార్టీనుంచి టికెట్ ఆశించి, అవకాశం దక్కకపోవడంతో స్వతంత్రులుగా బరిలోకి దిగినవారే కావడం గమనార్హం. శ్రీకాకుళం జిల్లాలోనూ రెబల్ అభ్యర్థుల ప్రభావం స్పష్టంగా కనిపించింది. అక్కడ ఏకంగా 16 మంది స్వతంత్రులు గెలుపొందగా, వారిలో అత్యధికులు టీడీపీకి చెందినవారే కావడం పార్టీ స్థానిక బలాన్ని సూచిస్తోంది.

మచిలీపట్నంలో నర్మదా నది 108 శివలింగాలు...

మచిలీపట్నం నవంబర్ 9(మీ వార్త ప్రతినిధి)
మచిలీపట్నం బుట్టయ్యపేట దత్తాశ్రమంలో కార్తీక మాసం పురస్కరించుకొని నర్మదా నది నుండి తీసుకొచ్చిన 108 శివలింగాలు నగర ప్రజల అభిషేకం కోసం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ మేరకు దత్తాశ్రమంలో కార్తీకమాస ఉత్సవ కరపత్రాలు ఆవిష్కరణ ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ చే జరిగింది. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ మైసూరు శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీకి మైసూరు తర్వాత మచిలీపట్నం పై అపారమైన ప్రేమ ఉందని తెలియజేశారు. శ్రీ స్వామీజీ ఎంతో ప్రేమతో స్పటిక లింగాన్ని నర్మదా నది నుండి 108 శివలింగాలని మరియు 12 అడుగుల ఎత్తుగల శివలింగాన్ని కార్తీక మాసం పురస్కరించుకుని మచిలీపట్నం పంపినట్లు తెలియజేశారు. మచిలీపట్నం పరిసర ప్రాంత ప్రజలు స్వయంగా అభిషేకం చేసుకునే అవకాశం కల్పించారు. నగర ప్రజల కోసం ఏర్పాటు చేసిన కార్తీక మాసం శివలింగాల అభిషేక కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని చిన్నం గోవర్ధన,మాదిరెడ్డి అంజిబాబు విజ్ఞప్తి చేశారు .ఈనెల 25.26 తేదీలలో మచిలీపట్నం లేడీస్ క్లబ్ లో శ్రీ శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ వారి ఆధ్వర్యంలో సామూహిక భగవద్గీత పారాయణం కార్తీక కోటి దీపోత్సవం కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు ఈ కార్యక్రమంలో తమ్మన సుబ్బారావు , కందప్ప శివరామకృష్ణ , మునుకుంట్ల శ్రీ నివాసరావు ,తాళ్ళూరి శోభరాణి . చిన్నం గోవర్ధన్, మాదిరెడ్డి అంజిబాబు, మల్లాది బుద్దేశ్వర రావు, కలవరపు వర ప్రసాద్.దైత శ్రీ నివాసరావు లంకి శెట్టి వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



యానాదుల కాలనీలో చిన్నారులతో కలిసి దీపావళి
వేడుకలు నిర్వహించిన హ్యుమానిటీ ఫౌండేషన్



మచిలీపట్నం: నవంబర్ 9(మీ వార్త ప్రతినిధి)
దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని, పేద, నిరుపేద కుటుంబాల పిల్లలు కూడా పండుగ ఆనందాన్ని అనుభవించాలనే సంకల్పంతో మచిలీపట్నంలోని హ్యుమానిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా మచిలీపట్నం కాలేఖాన్ పేట సమీపంలోని చెరువు వద్ద నివసిస్తున్న యానాదుల కాలనీకి ఫౌండేషన్ సభ్యులు వెళ్లి అక్కడి చిన్నారులకు ముందుగా మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం పిల్లలకు దీపావళి టపాసులు అందజేసి, వారితో కలిసి దగ్గరుండి దీపావళి వేడుకలను రుపుకున్నారు.సాధారణంగా పండుగలు ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకుంటారు. అయితే సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు కూడా పండుగ సంతోషాన్ని పంచాలనే ఉద్దేశంతో హ్యుమానిటీ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది అని అధ్యక్షురాలు షైక్ నూర్జహాన్ అన్నారు. టపాసులు అందుకున్న చిన్నారుల ముఖాల్లో కనిపించిన ఆనందం, వారి చిరునవ్వులు ఫౌండేషన్ సభ్యులకు ఎంతో సంతృప్తినిచ్చాయి అని సంతోషాన్ని వ్యక్తపరిచారు. పండుగ అంటే కేవలం మన ఇంట్లో వెలుగులు నింపుకోవడం మాత్రమే కాదు, మన చుట్టూ ఉన్న వారి జీవితాల్లో కూడా ఆనందాన్ని నింపడమే నిజమైన పండుగ అని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు.సహాయం మీది -- సహకారం మాది అనే నినాదంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న హ్యుమానిటీ ఫౌండేషన్, భవిష్యత్తులో కూడా ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుందని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవ స్థాపక అధ్యక్షురాలు షైక్ నూర్జహాన్, కార్యదర్శి లాయర్ అజ్మీ తు న్నిసా, విన్నకోట సంధ్య, నాగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బోడపాడులో వరద బాధితులకు చేయూతనిచ్చిన మానవతా

పెంటపాడు నవంబర్ 9 (మీ వార్త ప్రతినిధి)
మురస తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పెంటపాడు మండలం బోడపాడులో బోదెలు, మురుగు కాలువలు, వెంకయ్య కాలువ పొంగి పొర్లడంతో, కాలువ గట్టున నివసిస్తున్న పేదల గుడిసెలు వరద ముంపునకు గురయ్యాయి. దీంతో వారంతా బోడపాడులోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో తలదాచుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మానవతా పెంటపాడు మండల శాఖ నిరాశ్రయుల వద్దకు వెళ్లి వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం అందించి వారిని ఆదుకున్నారు. అయితే నిరాశ్రితులు ఈ ముంపు కారణంగా తమ వస్త్రాలను సైతం కోల్పోయాం అని చెప్పగా, మానవతా వారు వరద బాధితులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మానవత పెంటపాడు అధ్యక్షులు ఆర్.బి.టి. రాజకుమార్ మాట్లాడుతూ కష్టకాలంలో ఉన్నవారి కష్టాల్లో పాలుపంచుకుని వారికి చేయూతనివ్వడమే మానవతా ధర్మమని అన్నారు. స్థానిక పెద్దలు సరస్వతుల హనుమంతరావు మాట్లాడుతూ పెంటపాడు మండలంలో మానవత కార్యక్రమాలు విజయవంతంగా సాగడానికి మానవత ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ తాడేపల్లి మోహనరావు కృషే కారణమన్నారు. ప్రస్తుతం ఆయన స్వీడన్‌లో ఉన్నప్పటికీ ఇక్కడ తన బృందంతో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు మీసాల సత్యనారాయణ, తెలుగు పండిట్ సూరి సూర్యనారాయణ, స్థానిక పంచాయతీ కార్యదర్శి, మానవత చైర్మన్ తారాడి పాల్, విప్పర్తి నాయుడు, ఏలూరు వీరస్వామి, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



క్షత్రియ కుల కులాధిపత్య ధోరణిపై ఎస్సీ, ఉప కులాలు తిరుగుబాటు

సర్పంచ్ అభ్యర్థిత్వం పై అగ్రకుల పెద్దల జోక్యం
పట్ల దళిత సంఘ నేతలు ఆగ్రహం

అల్లవరం, నవంబర్ 10 (మీ వార్త విలేఖరి):?
గోడిలంక గ్రామ పంచాయతీ పరిధిలో షెడ్యూల్ కులాల రాజ్యాంగబద్ధ హక్కులను నిర్వీర్యం చేస్తూ, రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా క్షత్రియ ఆధిపత్య వర్గంలోని కొందరు వ్యక్తులు అవలంబిస్తున్న కులాహంకార ధోరణిని తీవ్రంగా ఖండిస్తూ ఈ అప్రజాస్వామిక విధానాలను వ్యతిరేకిస్తూ దళిత సామజిక వర్గానికి చెందిన మాల, మాదిగ కులాల ప్రజలు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట తమ నిరసనను వ్యక్తం చేశారు.?ఈ సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా నాయకులు శెట్టిబత్తుల తులసి దుర్గారావు మాట్లాడుతూ...నేడు రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎస్సీ, బీసీ రిజర్వేషన్ల షెడ్యూల్‌ను విడుదల చేసిందన్నారు. గ్రామంలో అనాదిగా కొనసాగుతున్న అగ్రకుల పెత్తందారీ విధానంలో భాగంగా, ఎస్సీ, బీసీ, మైనారిటీలకు దక్కాల్సిన రాజ్యాంగబద్ధ రిజర్వేషన్లను ఎస్సి కులంలో ఎవరు సర్పంచ్ అభ్యర్థిని నియమించాలో ఎవరు పోటీ చేయాలనే నిర్ణయాలను క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు తమ చేతుల్లోకి తీసుకున్నారని మండిపడ్డారు. రాజ్యాంగ బద్ధంగా ఎస్సి కుల సర్పంచ్ అభ్యర్థి రిజర్వేషన్ విడుదలైనప్పటిని ?ఎన్నికలు లేదా నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాకముందే, ఎస్సీ కులాల ప్రజలకు కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా, వారికీ తెలియకుండ తమ అడుగులకు మడుగులొత్తే ఒక డమ్మీ వ్యక్తిని సర్పంచ్ అభ్యర్థిగా ప్రకటించుకున్నారని ఆరోపించారు. అంతేకాకుండా, వార్డు సభ్యుల ఎన్నిక జరగకుండానే ఉపసర్పంచ్ అభ్యర్థిని కూడా ఏకపక్షంగా నిర్ణయించి ప్రకటించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. “మాకు పంచాయతీ ఎన్నికలతో అవసరం లేదు, మేమే రాజ్యాంగం... మా మాటే శాసనం” అనే రీతిలో క్షత్రియ సామాజిక వర్గం అవలంబిస్తున్న కులాధిపత్య, కులాహంకార ధోరణిని ఎస్సీ, మాల, మాదిగ ఉపకులాల ప్రజలు ముక్తకంఠంతో ఖండించారు.రాజ్యాంగ విధానాలను నిర్వీర్యం చేస్తున్న తిరును షెడ్యూల్ కులాల ప్రజలు వ్యతిరేకించారు ?ఈ ఎన్నికల నిర్వహణలో తాము పూర్తిస్థాయిలో పాల్గొంటామని, కులాహంకారానికి వ్యతిరేకంగా తమ తిరుగుబాటును నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మా హక్కులను మేమే కాపాడుకుంటామని, రాబోయే ఎన్నికల్లో ఎస్సీ, బీసీల ఐక్యతతో వీటికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. గోడిలంక గ్రామ పంచాయతీలో విధులను, నిధులను, అధికారులను నిర్దేశించేది ప్రజలేనని తేల్చిచెప్పారు. ?షెడ్యూల్ కులాల హక్కులను నిర్వీర్యం చేసే క్షత్రియ కులాహంకార వ్యక్తులు రాబోయే రోజుల్లో మాల మాదిగ కులాలు ఈ గ్రామ పంచాయతీలో అధికారం చెప్పడతారనే విషయాన్ని కులాహంకారులు తమ గోడల మీద రాసుకోవాలని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో పంచాయతీ పరిధిలో వివిధ రూపాల్లో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూముల బాగోతాలను బహిర్గతం చేస్తామని, ప్రజల అభివృద్ధి కొరకు వాటిని ఉపయోగించేలా పోరాటం చేస్తామని తెలిపారు. అంతేకాకుండా, తప్పుడు లెక్కలతో దోచుకుంటున్న ప్రజాధనం లెక్క తేలుస్తామని షెడ్యూల్ కులాల ప్రజలు ఈ సందర్భంగా తీవ్రంగా హెచ్చరించారు. ఈ సందర్భంగా వివిధ దళిత సంఘల మద్దతుతో కులాధిపత్య ధోరణి పై తిరుగుబాటు కొనసాగిస్తామన్నారు ఈ యొక్క కులాధిపత్య ధోరణిని కండించినవారులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కారెం వెంకటేశ్వరరావు విసికే పార్టీ రాష్ట్ర నాయకులు బొంతు రమణ జిల్లా నాయకులు డేవిడ్, బిఎస్పీ . నాయకులు వాకపల్లి హరీష్, సాపే రమేష్, మరియు గ్రామ పెద్దలు కుంచె చంద్రరావు. శెట్టిబత్తుల బాలకృష్ణ మూర్తి, బొమ్మి శ్రీనివాసరావు,సవరపు బాపూజీ, పోతుల శ్రీను బళ్ళ నాగరాజు, గోసంగి నరేష్, రొక్కుల నవీన్, సవరపు చిరంజీవి, దిగుమార్తు వెంకటేస్వరరావు, మరియు యావత పోతుల సతీష్, కొనుకు నాగరాజు, ఇంజె సుబ్రహ్మణ్యం,యలంగి నరేష్, శెట్టిబత్తుల ప్రసాద్, సేవల కేశవరావు, పిల్లి చిట్టిబాబు,జల్లి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు





విజేతలకు లంకిశెట్టి కార్యాలయంలో సన్మానాలు....



మచిలీపట్నం, నవంబర్ 9 (మీ వార్త ప్రతినిధి) ఇటీవల జరిగిన స్థానిక సంస్థలలో జనసేన తెలుగుదేశం పార్టీ తరపున విజేతలైన అభ్యర్థులను న్యాయవాది లంకిశెట్టి బాలాజీ 19 డివిజన్ మాజీ కార్పొరేటర్ లంకిశెట్టి వనజ జగన్నాధపురం లోని తమ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మచిలీపట్నం మేయర్ అబ్దుల్ అబీద 16 డివిజన్ కార్పొరేటర్ హసీం బేగ్, 17వ డివిజన్ కార్పొరేటర్ దింటకుర్తి సుధాకర్, 18 డివిజన్ కార్పొరేటర్ మరకాని సమతా కీర్తి, ఎనిమిదవ డివిజన్ కార్పొరేటర్ పినిశెట్టి నాగ ఛాయాదేవి, 56వ డివిజన్ కార్పొరేటర్ పీవీ ఫణి కుమార్ సతీమణి విమల గాయత్రి, గూడూరు మండలం ఆకులమన్నాడు ఎంపీటీసీ జనసేన అభ్యర్థి బాకీ శ్రీనివాసును ఘనంగా సన్మానించారు.. కీలకమైన సమయంలో ఓటర్లు ఎంతో నమ్మకంతో ఓట్లు వేశారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధికి అగ్ర పీఠం వెయ్యాలని లంకిశెట్టి అన్నారు. రాబోయే రోజులలో రాజకీయాలకుతీతంగా నగర అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించి తమ సత్తా చాటాలని బాలాజీ అభ్యర్థులకు సూచించారు. గెలుపొందిన అభ్యర్థులకు శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. మున్సిపల్ చట్టం పై అవగాహన పెంచుకోవాలని ప్రతి అభ్యర్థి తమ యొక్క హక్కులను బాధ్యతలను చట్టప్రకారం తెలుసుకోవాలని బాలాజీ అన్నారు.

పేద విద్యార్థులకు వేమూరి చారిటబుల్ ట్రస్ట్ చేయుత...





మచిలీపట్నం నవంబర్ 9 (మీ వార్త ప్రతినిధి) వేమూరి వెంకటసుబ్బయ్య కుదరవల్లి సీతారామయ్య వేమూరి వెంకట రమేష్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మచిలీపట్నం జవార్ పేట టెక్కాలోని మదర్స స్కూల్ విద్యార్థులకు ఇతర విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు. వేమూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 60 రోజులలో 11 సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్ అన్నారు. ప్రతి ఒక్కరూ తమకున్నంతలో కొంత భాగాన్ని సమాజంలో అవసరం ఉన్న వ్యక్తులకు సహాయం ద్వారా అందించి ఆదుకోవాలని అన్నారు.తన సంపాదనలో కొంత భాగం పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం కేటాయించాలని నిశ్చయించుకున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు వేమూరి వెంకట రమేష్ తెలియజేశారు. సేవా కార్యక్రమాల్లో కులమతాలు లేకుండా అందరికీ సహాయం అందించటం వేమూరి చారిటబుల్ ట్రస్ట్ ముందడుగులో ఉందని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు. సుబ్బయ్య హోటల్ ద్వారా నగర ప్రజలకు సుపరిచితమైన వేమూరి కుటుంబం నేడు సేవా కార్యక్రమాల ద్వారా మరింత నగర ప్రజలకు దగ్గరవుతుందని బాలాజీ అన్నారు.ఈ కార్యక్రమంలో జోరుపేటలో నూతన నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ నాగబాబు జిల్లా ప్రభుత్వాసుపత్రి మాజీ డైరెక్టర్ అజీమ్ , టిడిపి నాయకులు మౌలాలి, చీలి సుమన్ న్యాయవాది మాటూరి రాజేష్, సింగ్, శ్రీనివాస్ మదర్స స్కూల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉల్లింగీపాలెం సచివాలయం ఏరియా లో దోమల నియంత్రణ లో భాగంగా ఆయిల్ బాల్స్ రిలీజ్

జిల్లా వైద్య ఆరోగ్య సిబ్బంది



మచిలీపట్నం నవంబర్ 9(మీ వార్త ప్రతినిధి) జిల్లా వైద్య శాఖా అధికారి దయాకర్ , జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ ఆదేశాల మేరకు ఈ రోజు యూ.పి.హెచ్.సి గిలకలదిండి పరిధిలో ఏరియాలో ఉల్లింగీపాలెం సచివాలయం ఏరియా లో దోమల నియంత్రణ లో భాగంగా నీటి నిల్వల ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ రిలీజ్ చేయడం జరిగింది, ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం లో వైద్య సిబ్బంది అయినా హెల్త్ సూపర్ వైజర్స్ రాఘవేంద్ర రావు , సూరిబాబు , హెల్త్ అసిస్టెంట్ బాబా రామ్మోహన్ రావు , శ్రీనివాసరావు ఆశ కార్యకర్తలు నాగలక్ష్మి, సరోజినీ పాల్గొన్నారు.

పెడన మున్సిపల్ చైర్మన్ బల్ల జ్ఞాన లింగ జ్యోత్నారాణి గంగయ్య ను ఘనవిజయం సత్కరించిన మిత్రులు



పెడన నవంబర్ 9(మీ వార్త ప్రతినిధి) పెడన పట్టణ మునిసిపల్ చైర్పర్సన్ గా ఘణ విజయం సాధించిన బల్ల జ్ఞాన లింగ జోష్ణ రాణి గంగయ్య గార్లను 1995 1996 10క్లాస్ మిత్రులు దుశ్యాలువ తో సన్మానించి అభినందించారు.
పెడన పట్టణ మున్సిపల్ చైర్పర్సన్ గా ఘణ విజయం సాధించిన బల్ల జ్ఞాన లింగ జోష్ణ రాణి గంగయ్య ను 1995 1996 10క్లాస్ మిత్రులు దుశ్యాలువ తో సన్మానించి అభినందించారు.

కడియద్ద ఎంపీటీసీ ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచాం...

మీరు వస్తే ఎక్కడ ప్రమాణం చేయడానికైనా సిద్ధమే.

ప్రతిపక్షాల విమర్శలకు సవాల్ విసిరిన కూటమి నాయకులు

తాడేపల్లిగూడెం నవంబర్ 9 (మీ వార్త ప్రతినిధి)
ఎంపీటీసీ ఓట్ల లెక్కింపు అత్యంత ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిందని, అధికారులు, పోలింగ్ ఏజెంట్లు, అభ్యర్థుల సమక్షంలో జరిగిన లెక్కింపులో ఎలాంటి అవకతవకలు జరగలేదని, ఈ విషయంపై ఎక్కడ ప్రమాణం చేయడానికైనా తాము సిద్ధమని కడియద్ద కూటమి నాయకులు సవాల్ విసిరారు. కడియద్ద ఎంపీటీసీ స్థానంలో జనసేన తరఫున దారపురెడ్డి పద్మ ఒక్క ఓటు మెజారిటీతో గెలుపొందిన విషయంపై ప్రతిపక్ష నాయకులు అర్థంలేని విమర్శలు చేస్తున్నారని, ఆ విమర్శలను తిప్పికొడుతూ సోమవారం గ్రామంలో కూటమి నాయకులు సమావేశం నిర్వహించారు. టీడీపీ జడ్పీటీసీ నేకూరి కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఎలాంటి అధికార దుర్వినియోగం జరగలేదని, దారపురెడ్డి పద్మకు చెందిన రెండు చెల్లని ఓట్లు గుర్తుపై అస్పష్టంగా స్వస్తిక్ మార్కు లేదని తొలగించారని, వాటిని ఎన్నికల ఎన్నికల అధికారి సూరిబాబు పరిగణనలోకి తీసుకోలేదన్నారు. మాజీ సర్పంచ్ పాకనాటి తాతాజీ



మాట్లాడుతూ కౌంటింగ్ సమయంలో మొదట వైసీపీ అభ్యర్థి కొండపల్లి నాగలక్ష్మి ఒక ఓటు మెజారిటీతో గెలిచినట్లు అధికారులు చెప్పారని, చెల్లని ఓట్లపై పోలింగ్ ఏజెంట్‌గా ఉన్న తాను అభ్యంతరం తెలపగా రీ-వెరిఫికేషన్, రీ-కౌంటింగ్ జరిగిందన్నారు. రెండుసార్లు రీ-కౌంటింగ్ జరిగిన తర్వాత జనసేనకు రెండు ఓట్లు ఎక్కువ రావడంతో జనసేన అభ్యర్థి దారపురెడ్డి పద్మ ఒక ఓటు మెజారిటీతో గెలుపొందారని వివరించారు. పరిమి కిరణ్ మాట్లాడుతూ అయ్యప్ప మాల వేసుకున్న తాను కౌంటింగ్ సందర్భంలో అక్కడే ఉన్నానని, అయ్యప్ప మాలలో అబద్ధం ఆడే అవసరం తమకు లేదని, మాల సాక్షిగా ప్రజాస్వామ్యబద్ధంగా లెక్కింపు జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరిమి వెంకటేశ్వరరావు, నాయకులు మద్దిపాటి సత్యనారాయణ, వట్టి నాగమాణిక్యాలరావు తదితరులు మాట్లాడారు.

జి. మాడుగుల ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శుల పదవీకాలం మరో ఆరు నెలలు పొడిగింపు

అధ్యక్ష, కార్యదర్శులు, అరుణ్. అమీర్

జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి)
?సమాజంలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు నిర్భయంగా వెలుగులోకి తెస్తూ, ప్రజలకు నిజాలను చేరువ చేస్తున్న పాత్రికేయుల సంక్షేమం కోసం జి. మాడుగుల ప్రెస్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటోంది. తాజాగా, జి. మాడుగుల ప్రెస్ క్లబ్ అధ్యక్ష మరియు కార్యదర్శుల సమర్థవంతమైన నాయకత్వాన్ని, వారి సేవలను గుర్తించి.. వారి పదవీకాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగించడం విశేషం. ఈ నిర్ణయం పట్ల విలేకరుల వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ?జర్నలిస్టుల భద్రతకు ముప్పు వాటిల్లిన ప్రతిసారీ ప్రెస్ క్లబ్ అండగా నిలబడి, అధికారుల దృష్టికి సమస్యలను తీసుకువెళ్లడంలో తన గళాన్ని గట్టిగా వినిపించింది. విలేకర్ల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా వారు చేపడుతున్న కార్యక్రమాలు, ఇబ్బందుల్లో ఉన్న జర్నలిస్టులకు భరోసా కల్పిస్తున్న తీరు ఎంతో అభినందనీయం.

?అభినందనలు:
?సమస్యల సుడిగుండంలోనూ జర్నలిస్టుల పక్షాన నిలబడి, ప్రెస్ క్లబ్ బాధ్యతలను దిగ్విజయంగా నిర్వహిస్తున్న అధ్యక్ష, కార్యదర్శులకు ఈ పదవీకాల పొడిగింపు సర్వథా తగినది. రానున్న రోజుల్లోనూ వారు మరింత ఉత్సాహంతో, పారదర్శకతతో విలేకర్ల సంక్షేమం కోసం పాటుపడాలని ఆశిస్తూ.. వారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేసిన పత్రిక మిత్రులు ..
ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై నిరంతరం పోరాటం సాగిస్తూనే ఉంటామని, సోదరులు ఇంతవరకు మాకు సహకరించినట్లుగా ఇక పైన కూడా మాకు సహకరించగలరని ఈ సందర్భంగా



కోరుతున్నామన్నారు..

మెకానిక్ షాప్‌లో 7 ద్విచక్ర వాహనాలు దగ్ధం

ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తుల దురాగాతం

“ ?5 బైక్‌లు పూర్తిగా, 2 బైక్‌లు పాక్షికంగా అగ్నికి ఆహుతి

కళాశాల విద్యార్థులపై స్థానికుల అనుమానం.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

?జి.మాడుగుల (మీ వార్త ప్రతినిధి) మండల కేంద్రంలోని గాంధీ నగరం కాలనీలో ఆదివారం అర్ధరాత్రి దారుణ సంఘటన చోటుచేసుకుంది. స్థానిక ‘సాయి మెకానిక్ షాప్’ వద్ద నిలిపి ఉంచిన ఏడు ద్విచక్ర వాహనాలకు గుర్తుతెలియని దుండగులు నిప్పంటించారు. ?అర్ధరాత్రి సమయంలో మెకానిక్ షాప్ ప్రాంగణం నుండి ఒక్కసారిగా మంటలు, దట్టమైన పొగలు చెలరేగడాన్ని గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించినప్పటికీ, మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో షాప్ వద్ద ఉన్న 5 ద్విచక్ర వాహనాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. మరో రెండు ద్విచక్ర వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో లక్షలాది రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు సమాచారం.

?కళాశాల విద్యార్థులపై స్థానికుల అనుమానం...!
సంఘటనా స్థలానికి సమీపంలోనే ఉన్న కళాశాల విద్యార్థులే ఈ పోకిరీ చేష్టలకు పాల్పడి ఉంటారని స్థానికులు బలమైన అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



కాలనీ వాతావరణాన్ని భయభ్రాంతులకు గురిచేసేలా ఇటువంటి చర్యలకు ఒడిగట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

?రంగంలోకి దిగిన పోలీసులు:
సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని, మంటలకు గల కారణాలు మరియు దుండగుల ఆచూకీ కోసం తీవ్రంగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని



పోలీసులు తెలిపారు.

ఆదివాసీ ఉపాధ్యాయుల హక్కుల సాధనలో ఏటీఏ కీలక పాత్ర

కోతులగుట్టలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ఎటపాక, నవంబర్ 09 (మీ వార్త ప్రతినిధి): కూనవరం మండలంలోని కోతులగుట్ట గ్రామంలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఏటీఏ) 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కూనవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిచ్చడి అప్పారావు జెండాను ఆవిష్కరించారు. అనంతరం కొమరం భీం విగ్రహాన్ని శుభ్రపరిచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఆదివాసీ ఉపాధ్యాయుల అభ్యున్నతికి ఏటీఏ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడేలా సంఘం తన సేవా కార్యక్రమాలను, హక్కుల సాధన పోరాటాలను కొనసాగించాలని సూచించారు. జిల్లా అధ్యక్షులు సరియం అనిల్ కుమార్ మాట్లాడుతూ 2012 నవంబర్ 9న ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఆవిర్భవించిందని తెలిపారు. ఏర్పడిన కొద్ది కాలంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆదివాసీ ఉపాధ్యాయులకు 100 శాతం పదోన్నతులు సాధించిన ఘనత సంఘానికి దక్కిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆదివాసీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించకపోవడంతో తన పేరుతో హైకోర్టులో న్యాయపోరాటం చేసి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సహాయకులుగా పలువురికి పదోన్నతులు సాధించామని గుర్తుచేశారు. రంపచోడవరం ఏజెన్సీ పరిధిలో గతంలో పదోన్నతులు పొందని ఉపాధ్యాయులకు సైతం ఏటీఏ కృషితో పదోన్నతులు లభించాయన్నారు. 2017 వేతన సవరణ ఉత్తర్వుల్లో ఏజెన్సీ అలవెన్సు ప్రస్తావన లేకపోవడంతో సంఘం పోరాడి దానిని సాధించిందని, దీంతో ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న గిరిజన, గిరిజనేతర ఉపాధ్యాయులందరికీ ఏజెన్సీ అలవెన్సు అందుతోందని తెలిపారు. జీవో నంబర్ 3 రద్దయిన సమయంలో తొలుత సమీక్ష పిటిషన్ దాఖలు చేసిన సంఘం ఏటీఏ అని పేర్కొన్నారు. జీవో నంబర్ 3కి ప్రత్యామ్నాయంగా ఏజెన్సీ ప్రత్యేక నియామకాల చట్టం తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర మహిళా కార్యదర్శి మల్లం రామతులసి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ ఉపాధ్యాయులకు అండగా నిలుస్తూ వారి ఉద్యోగ, సర్వీసు సమస్యల పరిష్కారానికి



మండల, జిల్లా కమిటీలు నిరంతరం కృషి చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కట్టం వీరయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఐటీడీఏ ఉపాధ్యాయుల ఇన్‌చార్జి సోందే వెంకట్రావు, జిల్లా కోశాధికారి చిచ్చడి జితేంద్ర, కార్యవర్గ సభ్యులు ఉర్మ బాలాజీ, జిల్లా మహిళా కార్యవర్గ సభ్యురాలు పాయల భవాని, మండల ప్రధాన కార్యదర్శి రామరాజు, పాయం పెద కామేష్, పాయం చిన కామేష్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జి.మాడుగుల మండల జడ్పీటిసి సోమేలీ అఖిలకు ఎన్నికల డిక్లరేషన్ ఫారం అందజేత



జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి)
అల్లూరి సీతారామరాజు జిల్లా, జి.మాడుగుల మండల జడ్పిటిసి గా ఎన్నికైన కుమారి సోమేలీ అఖిల ప్రియ సోమవారం నాడు జిల్లా ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ, ఐఏఎస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో భాగంగా అత్యంత కీలకమైన అధికారిక పత్రమైన ఎన్నికల డిక్లరేషన్ ఫారం (ఫారం ౨౨ఎ౨) ను ఆమె జిల్లా ప్రాజెక్ట్ అధికారి చేతుల మీదుగా అందుకున్నారు. ?ఈ కార్యక్రమంలో ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా తదుపరి లాంఛనాలను పూర్తి చేయడం జరిగింది. జి.మాడుగుల మండల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, స్థానిక ప్రాంత అభివృద్ధికి మరియు ప్రజా సంక్షేమానికి కుమారి సోమేలీ అఖిల తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఈ సందర్భంగా పలువురు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు నాయకులు ఆకాంక్షించారు. ఆమెకు నియోజకవర్గ ప్రజలు, శ్రేయోభిలాషులు పెద్దఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు.

నూతన జడ్పీటీసీ సభ్యులకు డిక్లరేషన్ ఫారాలు అందజేత

గోపు సత్యనారాయణ సమక్షంలో కార్యక్రమం



మచిలీపట్నం నవంబర్ 9 (మీ వార్త ప్రతినిధి)
మచిలీపట్నం నార్త్ జడ్పీటీసీ సభ్యురాలిగా ఎన్నికైన లంకె ఉషారాణి, కోడూరు జడ్పీటీసీ సభ్యురాలిగా ఎన్నికైన బొలిశెట్టి అరుణశ్రీలకు కృష్ణా జిల్లా జడ్పీ సీఈఓ శ్రీహరి డిక్లరేషన్ ఫారాలను అందజేశారు.ఈ సందర్భంగా కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలనిఆకాంక్షించారు.ప్రజల ఆశీస్సులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో సాధించిన ఈ విజయాలు మరింత బాధ్యతను పెంచాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గొర్రెపాటి గోపిచంద్, లంకె శేషగిరి, లంకె హరి, బండే శ్రీను, కాగిత శ్రీరామ్, అమిరెడ్డి శివయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..

ఆదివాసీ ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు ఆట నిరంతర కృషి -- జిల్లా కార్యదర్శి తెల్లం బుచ్చిరాజు





చింతూరు, నవంబర్ 9 మీ వార్త ప్రతినిధి : చింతూరు మండలంలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఆట) 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ ఏర్పాటై 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలంలోని ఆట ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.ఈ సందర్భంగా ఆట జిల్లా కార్యదర్శి తెల్లం బుచ్చిరాజు మాట్లాడుతూ.. ఆదివాసీ ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం కోసం ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఉపాధ్యాయులకు అవసరమైన సేవలు అందించడంలో, వారి సమస్యల పరిష్కారానికి అండగా నిలవడంలో ఆట ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. సంఘం ఐక్యతతో మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బయ్య, రవికుమార్, కన్నయ్య, రవి, శ్రీను, వినోద్, సురేష్, బాబూరావు, రామకృష్ణ, మీనా, కన్నమ్మ, సీత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నా జీవితంలో మరువలేని విజయం

పెంటపాడు జడ్పిటిసి తనబుద్ధి రవికిరణ్



ప్రత్యక్ష రాజకీయాలలో పోటీ చేసిన తొలి ఎన్నికల లోనే 11077 ఓట్ల మెజారిటీతో జడ్పిటిసి గా గెలుపొందడం తన జీవితంలో మరువలేని విజయం అంటూ పెంటపాడు మండలం జడ్పిటిసి తనబుద్ధి రవికిరణ్ అన్నారు. ఇంతటి ఘనవిజయాన్ని అందించిన ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యల కృషికి పనిచేస్తానని తెలిపారు. పెంటపాడు మండలం అభివృద్ధికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సహకారంతో పాటు తనని అన్నారు. తనకు ఎన్నికలలో పోటీ చేసే అవకాశం కల్పించినందుకు గాను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టిడిపి ఇన్చార్జ్ వలవల బాబ్జి, బిజెపి నాయకులు ఈతకోట తాతాజీ, జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్, తోట రాజా లకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. నా విజయానికి కృషి చేసిన పెంటపాడు మండలం కూటమి నాయకులు, కార్యకర్తల పోరాటాన్ని తాను మరువలేనని, ఎల్లవేళలా వారికి అందుబాటులో ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

మూడు దశల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి.

జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

మచిలీపట్నం: నవంబర్ 09(మీ వార్త ప్రతినిధి) ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.పోలింగ్ కేంద్రాల భవనాల స్థితిగతులను బీఎల్ఓలు మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించాలి.బ్యాలెట్ బాక్సుల అవసరాలను అంచనా వేసి, మూడు దశలకు అనుగుణంగా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి.జిల్లాలో మూడు దశల్లో నిర్వహించనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్, సహాయ కలెక్టర్ నమ్రత అగర్వాల్‌తో కలిసి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా పంచాయతీ అధికారి, ఆర్డీవోలు, డీఎల్‌డీఓలు, ఇతర సంబంధిత అధికారులతో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వివరాలు, ఎన్నికల జాబితాలు, రిజర్వేషన్లు, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, నామినేషన్ల స్వీకరణ, మానవ వనరుల వినియోగం, ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎలక్ట్రోరల్ రోల్స్ అత్యంత కీలకమని, ఓటర్ల వివరాలు, వార్డుల వారీగా ఓటర్ల మ్యాపింగ్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఒక వార్డుకు సంబంధించిన ఓటర్లు మరో వార్డులోకి లేదా సంబంధం లేని పోలింగ్ కేంద్రానికి మ్యాప్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీల పరిధిలోని హామ్లెట్లు, ప్రధాన గ్రామాల మధ్య ఓటర్ల విభజనను పరిశీలించి, సంబంధిత వార్డుల ఓటర్లు తమ వార్డు అభ్యర్థులకు ఓటు వేసే విధంగా జాబితాలు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు.ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సంబంధిత బీఎల్ఓలు మరోసారి వ్యక్తిగతంగా సందర్శించి, పోలింగ్ నిర్వహణకు భవనం అనువుగా ఉందా లేదా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. శిథిలావస్థలో



ఉన్న భవనాలు, దెబ్బతిన్న రేకుల షెడ్లు, తగిన వసతులు లేని కేంద్రాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై నివేదిక అందించాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలను బీఎల్ఓలు పరిశీలించినట్లు, ఎన్నికల నిర్వహణకు అవి అనువుగా ఉన్నట్లు ఎంపీడీఓలు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల మార్పులు అవసరమైతే నిబంధనల ప్రకారం ముందస్తు అనుమతులు తీసుకొని, రాజకీయ పార్టీలకు కూడా సమాచారం అందించాలని స్పష్టం చేశారు.బ్యాలెట్ బాక్సుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మండలంలో మొత్తం అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఇప్పటికే అందుబాటులో ఉన్న బాక్సుల వివరాలను సేకరించి, అదనంగా ఎన్ని అవసరమో స్పష్టమైన లెక్కలు రూపొందించాలన్నారు. మూడు దశల ఎన్నికలకు అనుగుణంగా బ్యాలెట్ బాక్సుల పంపిణీ, తరలింపు, తిరిగి స్వీకరణకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. మొదటి దశ ఎన్నికలకు ప్రాధాన్యతనిస్తూ, మూడో దశలో అందుబాటులో ఉన్న బాక్సులను తొలుత మొదటి దశకు తరలించాలని, అనంతరం మొదటి, రెండో దశల ఎన్నికలు పూర్తయిన కొద్దీ అవసరాలకు అనుగుణంగా బాక్సులను తదుపరి దశలకు సర్దుబాటు చేయాలన్నారు. ఈ ప్రక్రియలో సమీప మండలాల మధ్యే బాక్సుల తరలింపు జరిగేలా రూట్ మ్యాపింగ్ రూపొందించాలని, ప్రతి బాక్సు ఎక్కడి నుంచి ఎక్కడికి తరలించాలి, ఏ మండలానికి అప్పగించాలనే వివరాలతో ప్రత్యేక షీట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. బ్యాలెట్ బాక్సుల మరమ్మతులు, నిర్వహణ, వినియోగానికి సిద్ధంగా ఉంచే అంశాలను కూడాపరిశీలించాలన్నారు.బ్యాలెట్ పేపర్ల ముద్రణను పోటీలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా, గుర్తుల కేటాయింపు ప్రక్రియకు అనుగుణంగా జాగ్రత్తగా పూర్తి చేయాలని సూచించారు. చివరి నిమిషంలో అభ్యర్థుల సంఖ్యలో మార్పులు వచ్చినా ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలన్నారు.ఎన్నికల నిర్వహణకు అవసరమైన రూట్ అధికారులు, జోనల్ అధికారులు, ఇతర సిబ్బంది నియామకంలో అందుబాటులో ఉన్న అన్ని శాఖల మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల విధులకు నియమితులైన ప్రతి అధికారి, సిబ్బందికి వారి బాధ్యతలపై స్పష్టమైన అవగాహన కల్పించేలా శిక్షణ ఇవ్వాలని తెలిపారు.సమావేశంలో జెడ్పీ సీఈవో ఎం శ్రీహరి, బందరు, గుడివాడ ఆర్డీవోలు కే సాంబశివరావు, జి బాలసుబ్రమణ్యం, జిల్లా పంచాయతీ అధికారిణి, బందరు, గుడివాడ, ఉయ్యూరు డీఎల్‌డీఓలు, పి శ్రీనివాస్, సునీత శర్మ, పి స్వర్ణలత, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్ బరిలోకి..!

ఆదరించండి.. ఆశీర్వదించండి.. గ్రామానికి సేవ చేసే అవకాశం కల్పించండి

సర్పంచ్ అభ్యర్థిగా పోటీకి సిద్ధమైన రిటైర్డ్ జవాన్

పుల్లలచెరువు, నవంబర్ 9 (మీ వార్త) గ్రామాభివృద్ధే లక్ష్యంగా, ప్రజలకు నిస్వార్థ సేవలు అందించాలనే సంకల్పంతో పుల్లలచెరువు కు చెందిన దాసి వెంకటేశ్వరరావు (ఆర్మీ బుజ్జి) సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచేందుకు ముందుకొచ్చారు. విద్యావంతుడిగా, భారత సైన్యంలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన అనంతరం సొంత గ్రామమైన పుల్లలచెరువు అభివృద్ధికి తన వంతు కృషి చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల్లో కూటమి నాయకుల మద్దతుతో పోటీ చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామ ప్రజలు తనకు ఆశీస్సులు, ఆదరణ అందించి సేవ చేసే అవకాశం కల్పిస్తే ఎలాంటి స్వార్థం లేకుండా గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేస్తానని పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఫ్రెండ్స్ సర్వీస్ సంస్థ ద్వారా గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. సమాజానికి సేవ చేయాలనే ఆలోచనతోనే ఇప్పటివరకు అనేక కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. సర్పంచ్‌గా అవకాశం కల్పిస్తే గ్రామంలోని ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యం కల్పించడం, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, వీధి దీపాలు ఏర్పాటు చేయడం, అంతర్గత రహదారులను అభివృద్ధి చేయడం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి, ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం, పారదర్శకమైన పాలన, గ్రామాభివృద్ధికి అంకితభావంతో పనిచేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామంలోని యువత, పెద్దలు, మహిళలు అందరి సహకారంతో పుల్లలచెరువును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. ఒకసారి అవకాశం కల్పించి ఆదరించాలని, ఆశీర్వదించి గ్రామాభివృద్ధికి సేవ చేసే అవకాశం ఇవ్వాలని దాసి వెంకటేశ్వరరావు (ఆర్మీ బుజ్జి) గ్రామ ప్రజలను కోరారు. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా తాను పోటీలో



నిలవనున్నట్లు ఆయన ప్రకటించారు.

కూటమిలో దొంగలు పడ్డారు

వెన్నుపోటు రాజకీయాలు తగవు
అధికారం ఎవరికి శాశ్వతం కాదు
టిడిపి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు

తాడేపల్లిగూడెం నవంబర్ 9 (మీ వార్త ప్రతినిధి) మండలంలోని వెంకట్రామన్నగూడెం ఎంపీటీసీ (టీడీపీ) కూటమి అభ్యర్థిగా పోటీచేసిన పరిమి రవికుమార్ నాటకీయ పరిణామాల మధ్య ఓటమి చెందారని, దీనికి కారణం కూటమిలో దొంగలు పడ్డారని, వెన్నుపోటు రాజకీయాలు తగవని టిడిపి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు అన్నారు. సోమవారం తాడేపల్లిగూడెం లోని గొర్రెల లక్ష్మీనారాయణ కాంప్లెక్స్ లో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు, పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు ముళ్ళపూడి బాపిరాజు హాజరయ్యారు. కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకునేందుకు జిల్లా అధ్యక్షులు ప్రయత్నించగా గూడెం మండలం కుంచనపల్లి, ఉప్పరగూడెం గ్రామాలకు చెందిన కార్యకర్తలు పరిమి రవికుమార్ కు అన్యాయం జరిగిందని ఆవేదన చెందుతూ కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య ప్రయత్నం చేశారు. వారిని ప్రక్కన ఉన్న కార్యకర్తలు నాయకులు నిలువరించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రామరాజు మాట్లాడుతూ పరిమి రవికుమార్ కు అన్యాయం జరిగిందన్నారు. పార్టీ వ్యతిరేక శక్తులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు తీర్మానం చేసి అధిష్టానానికి పంపించడానికి వెనుకాడేది లేదన్నారు. కూటమి ముసుగులో దొంగలు కుట్రపూరిత రాజకీయాలు చేయడం తగదు అన్నారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే స్థానం కేటాయింపు విషయంలో బాబ్జికి కాదని బొలిశెట్టి శ్రీనివాస్ కి టికెట్ కేటాయించగా బాబ్జి, నాయకులు, కార్యకర్తలు పార్టీకి కట్టుబడి క్రమశిక్షణతో ఎమ్మెల్యే



బొలిశెట్టి శ్రీనివాస్ గెలుపుకు కృషి చేశారని, తద్వారానే ఆయనకు భారీ మెజారిటీ వచ్చిందని ఆయన గుర్తు అన్నారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదని, ఉన్నన్ని రోజులు విలువగా చూసుకోవాలని తెలిపారు. అన్ని రోజులు ఒకేలా ఉండవని, రోజులు తిరగబడినప్పుడు దానికి వడ్డీ రూపంలో లెక్క చెప్పాల్సి వస్తుందన్నారు. బాపిరాజు, తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడినప్పుడు రవిని గెలిపించుకునే బాధ్యత మాది అన్నవారు నేడు అతని ఎందుకు గెలిపించలేదని ఎమ్మెల్యే ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాజకీయాలలో గెలుపోటములు సహజమని కార్యకర్తలు సహనం కోల్పోవద్దని, సమతుల్యతను పాటించాలని, ప్రాణం విలువ చాలా ఖరీదైందన్నారు. మీరు పొతే మీ కుటుంబ సభ్యుల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. ముళ్లపూడి బాపురాజు మాట్లాడుతూ తాను రవికుమార్ విషయంలో పార్టీ పై స్థాయి నాయకులతో మాట్లాడానన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కి తనకు స్నేహబంధం ఎక్కువన్నారు. రవి పోటీ విషయంలో తాను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తో మాట్లాడగా గెలిపించుకునే బాధ్యత తనదని ఆయన చెప్పినట్లు బాపిరాజు తెలిపారు. అయినప్పటికీ ఇండిపెండెంట్ అభ్యర్థి పోటీ చేస్తుంటే ఎమ్మెల్యే నిలువరించలేదని అన్నారు. తాను పార్టీకి విధేయుడునని, పార్టీకి అన్యాయం చేస్తే స్నేహాన్ని అయినా వదిలేస్తానని అన్నారు. పార్టీకి కార్యకర్తలకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోనని తెలిపారు. దురదృష్టం



ఏంటంటే పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా పార్టీ అవకాశం కల్పించిందని, అధికారంలో ఉండగా మాత్రం వేరే వారిని ఎమ్మెల్యేలుగా చేయడం దీనికి కారణం అన్నారు. వలవల బాబ్జి మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు పళ్లా శ్రీనివాసరావు సైతం తన లెక్కచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇచ్చిన స్థానాలను సైతం ఎమ్మెల్యే తాను అభ్యర్థులను సూచించడం చాలా దురదృష్టకరమన్నారు. పొత్తు ధర్మంలో మొదట ఏ ప్రాంతంలో ఎవర్నుంచోవాలనేది వారి నిర్ణయించుకోవాలని తను సూచించానని ఆయన తెలిపారు. పరిమి రవికుమార్ విషయంలో ఇండిపెండెంట్ అభ్యర్థిని ఎవరు నిలబెట్టారు చెప్పాలని ప్రశ్నించారు. జగ్గయ్యపేటలో బిజెపి పూర్తిగా సహకరించిందన్నారు. నియోజకవర్గంలో పోలీసుల సహకారం లేదని, తెలుగుదేశం పార్టీ వారిపై పోలీసులు కర్కషంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. సిఐ, గూడెం రూరల్ సీఐ ని మార్చాలన్నారు. ఎమ్మార్వో చాలా దుర్మార్గాలకు పాల్పడుతున్నాడని, ఆయన చేస్తున్న అవినీతిపై ఎంక్వయిరీ వేసి సస్పెండ్ చేయాలన్నారు. ఎండిఓ కూడా అదే దూరంలో ఉన్నారని కూడా సస్పెండ్ చేయాలని రామరాజుకు తెలిపారు. పార్టీలో ఉంటూ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వెన్నుపోటు దారులను పార్టీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

తుఫాన్ తాకిడికి దెబ్బతిన్న వరిచేలను పరిశీలించిన ఏఓ రవికుమార్



పెంటపాడు, నవంబర్ 9 (మీ వార్త ప్రతినిధి) ఇటీవల సంభవించిన మురసు తుఫాన్ ఫలితంగా ఎర్రకాలువ, ఆపై యనమదుర్రు డ్రైన్ నుంచి వచ్చిన వరద నీటితో ముంపుకు గురై, నేటికీ ముంపు నుంచి తేరుకోకుండా నీటిలోనే మునిగి ఉన్న వరిచేలను పెంటపాడు మండల వ్యవసాయ అధికారి చీర్ల రవికుమార్ సోమవారం రైతులతో కలిసి పరిశీలించారు. ఈ నెల 7వ తేదీన తాడేపల్లిగూడెం నన్నయ్య యూనివర్సిటీలో జరిగిన స్థానిక ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల లెక్కింపు కార్యక్రమ పరిశీలనకు వచ్చిన తాడేపల్లిగూడెం ఆర్‌డీవీ వై. సూర్యారావు, నీటిపారుదల శాఖ డీఈ కె. ధర్మాజ్యోతి, శెట్టిపేట ఈఈ ఎం. రమేష్‌లు వరద ముంపుపై మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో నీరు తగ్గుముఖం పడుతుందని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి సోమవారం మండలంలోని బోడపాడు, కె. పెంటపాడు, యానాలపల్లి, పరిమెళ్ళ గ్రామాల వరిచేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోడపాడు డ్రైన్‌తో పాటు పక్కనున్న పంట బోదుల నిండా నిండిపోయి వరిచేలు ఆ ముంపులోనే ఉన్నాయన్నారు. దీనిపై ప్రభుత్వం సమగ్ర ఆలోచన చేసి రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఆయన వెంట రైతులు, ఏఐఓ అజయ్ ఉన్నారు.

వికలాంగ కార్యకర్తను సత్కరించిన ఎంపీటీసీ పిచ్చుక రాజు





కుక్కునూరు నవంబర్ 09 (మి వార్తా ప్రతినిధి) ఎన్నికల ప్రచారంలో తన కోసం కష్టపడిన కార్యకర్తల సేవలను గుర్తిస్తూ కుక్కునూరు--1 ఎంపీటీసీగా విజయం సాధించిన కూటమి టీడీపీ అభ్యర్థి పిచ్చుక రాజు, వికలాంగ కార్యకర్తను సయ్యద్ యాకూబ్ పాషాను తన నివాసంలో ఘనంగా సత్కరించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనకు పూలమాల వేసి, శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రచార సమయంలో యాకూబ్ పాషా తన మూడు చక్రాల సైకిల్‌పై గ్రామంలో తిరుగుతూ కూటమి తరఫున టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన పిచ్చుక రాజుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తడుస్తూనే ప్రచారంలో పాల్గొని తన అంకితభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పిచ్చుక రాజు మాట్లాడుతూ.. యాకూబ్ పాషాతో పాటు తన విజయానికి సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సమయంలో తనకు అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఓటర్లను ఎప్పటికీ మరువబోనని, ప్రతి ఒక్కరినీ గుర్తుంచుకుంటానని అన్నారు. తన విజయానికి సహకరించిన వారందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టినరోజు నాడే ఎంపీటీసీగా గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు

వైసిపి ఇన్చార్జ్ వడ్డీ రఘురాం నాయుడును కలిసిన పత్స
వెంకట్రామన్నగూడెం ఎంపీటీసీ పత్స రామచంద్రయ్య



తాడేపల్లిగూడెం నవంబర్ 9 (మీ వార్త ప్రతినిధి) మండలంలోని వెంకట్రామన్నగూడెం, జగ్గయ్యపేట ఎంపీటీసీ గా తన పుట్టినరోజు నాడే గెలిపించిన ప్రజలకు, వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ వడ్డీ రఘురాం నాయుడు కు వెంకట్రామన్నగూడెం ఎంపీటీసీ పత్స రామచంద్రయ్య కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వడ్డీ రఘురాం నాయుడును రామచంద్రయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. పూలదండను వేసి, పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో వడ్డీని రామచంద్రయ్య సత్కరించారు. ఎంపీటీసీ రామచంద్రయ్య మాట్లాడుతూ తనకు పార్టీ బీఫామ్ ఇచ్చి తన గెలుపుకు వడ్డీ రఘురాం ఎంతగానో సహకరించారన్నారు.అర్ధరాత్రి దాటిన ఫలితం వెలువడకుండా ఉత్కంఠ భరితంగా సాగిన పోరులో చివరికి విజయం తనను వరించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. తన గెలుపుకి కృషిచేసిన ప్రతి ఒక్కరిని గుర్తుంచుకుంటానని, వెంకట్రామన్నగూడెం, జగ్గయ్యపేట గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఉపాధ్యాయులు మునగాల వెంకటరామయ్య మృతికి సంతాపం తెలిపిన ఎమ్మెల్యే బొలిశెట్టి



తాడేపల్లిగూడెం నవంబర్ 9 (మీ వార్త ప్రతినిధి) ప్రభుత్వ ఉపాధ్యాయులు మునగాల వెంకటరామయ్య ఇటీవల మరణించారు. ఈ విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ వారి నివాసానికి వెళ్లి, పార్థివదేహానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆయన ఆకాంక్షించారు. మునగాల వెంకటరామయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని ఆయన తెలిపారు.

మీ ప్రేమాభిమానాలకు జీవితాంతం కట్టుబడి ఉంటా







కూటమి ఐక్యత, సమిష్టి కృషితో విజయ పరంపర

ప్రజల ఆశీర్వాదం, నమ్మకమే మా బలం

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయాలు మరింత బాధ్యతను పెంచాయి

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

నూతనంగా ఎన్నికైన రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, జడ్పిటిసిలు, ఎంపీటీసీలకు ఘన సత్కారం

అత్యంత వైభవంగా కూటమి విజయోత్సవ ఆత్మీయ వేడుక

ద్రాక్షారామం (మీ వార్తా ప్రతినిధి నవంబర్ 09) :- కూటమి విజయోత్సవ ఆత్మీయ వేడుక ద్రాక్షారామంలోని పేపకాయల బాబ్జి కళ్యాణ మండపంలో సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కూటమి ప్రజాప్రతినిధులను అభినందిస్తూ, వారి విజయాలను పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుక ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన మేడిశెట్టి శేషారావుతో పాటు నూతనంగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్లను, కాజులూరు జడ్పీటీసీ కూటి శేషారత్నం రంజిత్ కుమార్, కే. గంగవరం మండలం జడ్పీటీసీ రవ్వా సీతామహాలక్ష్మి భూషణం, రామచంద్రపురం రూరల్ జడ్పీటీసీ టేకుమూడి సుజాత సత్యనారాయణ, కాజులూరు ఎంపీపీ అభ్యర్థి చందాల ఆదినారాయణ, గంగవరం ఎంపీపీ అభ్యర్థి చుండ్రు సూర్యకుమారి చౌదరి, రామచంద్రపురం రూరల్ ఎంపీపీ అభ్యర్థి డాక్టర్ మడకా రాంబాబుతో పాటు నియోజకవర్గంలోని ఎంపీటీసీలను మంత్రి వాసంశెట్టి సుభాష్, కూటమి సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి శేషారావు, చిక్కాల దొరబాబు ఘనంగా సత్కరించి అభినందించారు.

కూటమి ఐక్యతకు నిదర్శనమే ఈ విజయాలు

అనంతరం మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సాధించిన ఘన విజయాలు ఎన్డీఏ కూటమి ఐక్యతకు, సమన్వయానికి, సమిష్టి కృషికి నిదర్శనమన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పు కూటమి ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి ప్రతిబింబమని పేర్కొన్నారు. వైసీపీకి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పారని, ప్రజాతీర్పును గౌరవించాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందన్నారు. ప్రజాతీర్పును జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడటం సరికాదని విమర్శించారు. వారి వ్యవహారశైలి చూస్తుంటే మెదడు మోకాళ్లలో ఉన్నట్లుగా ఉందని ఘాటుగా వ్యాఖ్యానించారు.

ఎన్నికల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు ఎంతో సమన్వయంతో పనిచేశారని, పదవులు, వ్యక్తిగత అభిప్రాయాలకు అతీతంగా కూటమి ధర్మాన్ని పాటిస్తూ విజయాలను సాధించామన్నారు. ఈ విజయాలను ఇక్కడితో ఆపకుండా భవిష్యత్తులోనూ ఇదే ఐక్యత, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

విజయం కంటే ప్రజాసేవే ముఖ్యం

నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, అన్ని సామాజిక వర్గాలను కలుపుకొని సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు.

పదవులు అలంకారప్రాయంగా కాకుండా ప్రజలకు సేవ చేసే బాధ్యతగా భావించాలని, నాయకులకు క్రమశిక్షణతో పాటు ఓర్పు, సహనం ఎంతో అవసరమన్నారు. పదవిలో ఉన్నంతకాలం ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం గొప్ప వరమని పేర్కొన్నారు. ఒకసారి ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన తర్వాత అదే విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా ప్రజాసేవలో ముందుండాలని సూచించారు.

ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా ప్రజాక్షేత్రంలో ప్రజల తీర్పుతోనే విజయాలు సాధించామని, ఈ విజయాల వెనుక కూటమి నాయకులు, కార్యకర్తల కష్టంతో పాటు ప్రజల ఆదరణ ఉందన్నారు.

పంచాయతీ ఎన్నికల్లోనూ ఏకగ్రీవ విజయాలకు కృషి చేయాలి

రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధిక సంఖ్యలో స్థానాలను ఏకగ్రీవం చేసుకునేందుకు కూటమి నాయకులు, శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఐక్యతను పెంపొందిస్తూ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని సూచించారు.

అభివృద్ధి, సంక్షేమం.. సామాజిక సేవే మా లక్ష్యం

రామచంద్రపురం నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా నిరుపేద విద్యార్థులకు విద్యా సహకారం అందిస్తున్నామని, సామాజిక బాధ్యతతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. ద్రాక్షారామం మార్కెట్‌లో అగ్నిప్రమాదం కారణంగా నష్టపోయిన బాధితులకు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో, కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో విద్యా సంస్థల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని పేర్కొన్నారు.

ప్రజల ప్రేమాభిమానాలకు ఎప్పటికీ కట్టుబడి ఉంటాలి

రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలు తనపై ఉంచిన నమ్మకం, చూపిస్తున్న ప్రేమాభిమానాలు తనకు ఎంతో విలువైనవని మంత్రి సుభాష్ అన్నారు. ఎన్నికల్లో సాధించిన విజయాలు తన బాధ్యతను మరింత పెంచాయని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి మధ్యనే తిరుగుతానని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, ప్రజలు చూపిస్తున్న ఆదరణకు, అభిమానానికి జీవితాంతం కట్టుబడి ఉంటానని భరోసా ఇచ్చారు.

కూటమి ఐక్యతతోనే అద్భుత విజయాలు: వాసంశెట్టి సత్యం

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కూటమి సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయడం వల్లే గత సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన విజయాల స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అద్భుతమైన విజయాలు సాధించామన్నారు. కూటమి ఐక్యతను మరింత బలోపేతం చేసుకుంటూ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని పిలుపునిచ్చారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో తీవ్రంగా నష్టపోయిందని విమర్శించారు.

ప్రజల ఆదరణతోనే కూటమి అభ్యర్థులకు ఘన విజయం ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, చిక్కాల దొరబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గుర్తించిన ప్రజలు కూటమి అభ్యర్థులకు భారీ విజయాలను అందించారని తెలిపారు. ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రభుత్వ పరంగానే కాకుండా వ్యక్తిగతంగా, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాయని పేర్కొన్నారు. ఆ సేవలకు ప్రజలు తమ ఓట్ల రూపంలో ఆదరణ చూపించారని తెలిపారు.

విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటాం

కాజులూరు, గంగవరం, రామచంద్రపురం రూరల్ మండలాల నూతన జడ్పీటీసీలు కూటి శేషారత్నం, రవ్వ సీతామహాలక్ష్మి, టేకుమూడి సుజాత మాట్లాడుతూ.. తమ విజయానికి సహకరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్, వాసంశెట్టి సత్యం, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు. తమకు ఈ అవకాశం కల్పించిన కూటమి అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలియజేశారు.

మంత్రి సుభాష్ నియోజకవర్గానికి వచ్చిన తర్వాత రాజకీయ సమీకరణాల్లో వేగంగా మార్పులు చోటుచేసుకున్నాయని, కూటమి బలం మరింత పెరిగిందని పేర్కొన్నారు. ఇదే ఐక్యత, ఇదే విజయ పరంపరను భవిష్యత్తులోనూ కొనసాగిస్తూ ప్రజలకు సేవ చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గంగవరం ఎంపీపీ అభ్యర్థి చుండ్రు సూర్యకుమారి చౌదరి, కాజులూరు ఎంపీపీ అభ్యర్థి చందాల ఆదినారాయణ, రామచంద్రపురం రూరల్ ఎంపీపీ అభ్యర్థి డాక్టర్ మడకా రాంబాబుతో పాటు నియోజకవర్గంలోని కూటమి నాయకులు, ఆయా మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బుల్లెట్ రైలుపై పాలకుల దోబూచులాట!

శంషాబాద్– చెన్నై బుల్లెట్ ట్రైన్ అంశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాడుతున్నాయి. భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి అనుమతి మంజూరు చేయలేదని రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు. అంతే తప్ప జాతీయ రహదారి 65కు సమాంతరంగా సూర్యాపేట మీదుగా నిర్మిస్తామని స్పష్టం చేయలేదు. రాష్ట్ర మంత్రివర్గం అలైన్మెంట్ మార్పునకు తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్టు వివిధ చానళ్లలో ప్రసారమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు ఈ విషయమై ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వడం లేదు. ఏపీ పునర్‌వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కేంద్రం రెండు రాష్ట్రాల రాజధానులను కలుపుతూ స్పీడ్ రైలు కేటాయించాలి. రెండేండ్ల క్రితం శంషాబాద్–వైజాగ్ మార్గం మీదుగా సర్వే చేశారు. కానీ అది ముందుకు సాగలేదు. ఆంధ్ర లాబీయింగ్‌తోనే ప్రాజెక్టు ఆగినట్టు తెలుస్తున్నది.

పెట్టుబడిదారుల, పెత్తందారుల కుట్రల వల్లే తెలంగాణ దశాబ్దాలపాటు నష్టపోయింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కూడా వాళ్లే ఆటంకాలు సృష్టించారు. శంషాబాద్–వైజాగ్ స్పీడ్ రైల్ విషయంలోనూ ఆంధ్రా లాబీ చక్రం తిప్పినట్టు తెలుస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వేలాది ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు హైదరాబాద్‌కు ఇదే మార్గంలో ప్రయాణిస్తాయి. లాభాల పంట పండించే ఈ మార్గం మీదుగా రైల్వే కారిడార్ ఏర్పడితే, ఆంధ్ర ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యజమానులకు లాభాలు రాకపోగా, వారి వాహనాలు షెడ్డుకు పోవాల్సిందే. బుల్లెట్ ట్రైన్ ఆగమనాన్ని కూడా ఇవే శక్తులు ప్రభావితం చేస్తున్నాయని ఉద్యమకారులు, బుద్ధిజీవులు ఎలుగెత్తి చాటాల్సి ఉన్నది. జాతీయ రహదారి 65 వెంట ఉన్న సూర్యాపేట పట్టణం ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టం 1965 ప్రకారం జనాభా, ఆదాయవనరుల ఆధారంగా మున్సిపాలిటీగా ఏర్పడింది.

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో రైల్వే స్టేషన్ ఏర్పాటు జరిగి ఒకటిన్నర శతాబ్దం దాటినా సూర్యాపేటకు రైలు మార్గం లేదు. అనేకమార్లు వివిధ మార్గాల్లో సర్వేలు జరిగినా బడ్జెట్ కేటాయించలేదు, రైల్వే స్టేషన్ రాలేదు. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు వాణిజ్య వ్యాపార కేంద్రం విజయవాడకు మధ్యలో ఉన్న అతిపెద్ద ప్రాంతం సూర్యాపేట. నాటి జాతీయ రహదారి–9పై పేరెన్నికగన్న ప్రాంతం సూర్యాపేట. కేంద్రం ప్రతిపాదించి ఆమోదించిన అలైన్మెంట్‌ను మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదిత విధానాలు అభివృద్ధికి పూర్తిగా విరుద్ధమైనవి. వంద కిలోమీటర్ల దూరం తగ్గుతుందనే సాకు చూపి, అధిక జనాభా కలిగిన ప్రాంతాల/ పట్టణాల నుంచి ప్రజలను రవాణా సౌకర్యానికి దూరం చేయడమే. ప్రయాణికుల రద్దీ, ఆర్థిక నిర్వహణ, ప్రాంతాల అనుసంధానంపై రైలు మార్గం విజయం ఆధారపడి ఉంటుంది. అమరావతి -- హైదరాబాద్‌ను కలిపే మార్గాన్ని ఉపేక్షించడం వెనుక ఆంధ్ర ప్రైవేట్ బస్ సర్వీసుల యజమానుల ఒత్తిడికి తలొగ్గడం సరికాదు. కొందరి లాభాపేక్ష కోసం నిబంధనలను తుంగలో తొక్కడం విడ్డూరం. జాతీయ రహదారి 65పై హైదరాబాద్–సూర్యాపేట మధ్య రోజువారీ ప్రయాణికుల సంఖ్య ఆరు లక్షలు. అంటే ఈ దారి ఎప్పుడూ అత్యంత రద్దీగా ఉంటుంది. అందువల్ల యాక్సిడెంట్లు ఎక్కువ అవుతున్నాయి. కాలుష్యం విపరీతంగా పెరుగుతున్నది. పండుగలు కాలంలో టోల్‌గేట్స్ దగ్గర గంటల కొద్దీ రద్దీ తప్పడం లేదు. ప్రయాణ సమయం వృథా అవుతున్నది. విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో, వ్యాపార, వాణిజ్య సంఘాలకు అత్యంత ప్రయోజనకరమైనది స్పీడ్ రైలు. శంషాబాద్– చెన్నై– సూర్యాపేట బుల్లెట్ ట్రైన్ రూట్ అలైన్మెంటును మార్చడం అంటే ప్రజల ఆకాంక్షలను బలి చేయడమే. వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో ఏర్పాటయ్యే రైలు కారిడార్లకు ప్రతిఫలం రావాలన్నా, ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతం నుంచే ఏర్పాటు జరగాల్సి ఉన్నది.

కేంద్రం అలైన్మెంట్ ప్రకటించిన శంషాబాద్–చెన్నై బుల్లెట్ రైలు మార్గాన్ని నిర్మించాలని డిమాండ్ చేస్తూ రెండు నెలలుగా అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమాలు జరుగుతున్నాయి. రాజకీయాలకు అతీతంగా జేఏసీ ఆధ్వర్యంలో ప్రజలు నిరసన తెలియజేస్తున్నారు. ప్రజాప్రతినిధులకు విజ్ఞాపన పత్రాల అందించారు. సూర్యాపేట పట్టణ బంద్ పాటించారు.

వివిధ కుల, వృత్తి, వ్యాపార, వాణిజ్య, విద్యార్థి, యువజన, కార్మిక, ఉపాధ్యాయ, మహిళా సంఘాలు 66 రోజులుగా రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎవరికివారు ప్రజలతో దోబూచులాడటం సరికాదు. త్వరలోనే శాసనమండలి ఎన్నికలు జరుగనున్నాయి. ఆ తర్వాత జరగబోయే శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలపై కూడా ఈ ఉద్యమ ప్రభావం కచ్చితంగా ఉంటుంది.

క్యాబినెట్ బుల్లెట్ రైలు రాకుండా అడ్డుపడుతున్నది. తెలంగాణ అభివృద్ధిని మరోమారు అడ్డుకుని ఆంధ్ర రాష్ట్రానికి లాభం చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదనే అనుమానం కలుగుతున్నది.

హైదరాబాద్‌లో మొదటి రైల్వే స్టేషన్ 1874 అక్టోబర్ 9న ప్రారంభమైంది. మైసూరు పాలకుల వల్ల ఎదురైన సవాళ్లను ఎదుర్కోవడానికి, భాగ్యనగరాన్ని సైనిక స్థావరంగా మార్చడానికి, బొంబాయి, మద్రాస్ రైల్వే మార్గాలతో అనుసంధానించే లక్ష్యంతో స్టేషన్‌ను ప్రతిపాదించారు. 1856లో లార్డ్ డల్హౌసీ చేసిన ఈ ప్రతిపాదనకు నిజాం ప్రభుత్వం అంగీకరించింది.

1873లో ప్రజల వాటాలతో ఏర్పాటు చేసిన ట్రస్టులో నిజాం ప్రభుత్వం 5 లక్షల పౌండ్లను పెట్టుబడిగా పెట్టింది. బెంగాల్‌కు చెందిన రైల్వే ఇంజినీర్ మీడీ ఆధ్వర్యంలో వాడి–హైదరాబాద్ మధ్య రూ. 2 కోట్ల వ్యయంతో 110 మైళ్ల బ్రాడ్ గేజ్ మార్గం నిర్మాణం జరిగింది. 1874 నుంచి 1878 వరకు గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ సంస్థ ఈ మార్గాన్ని నిర్వహించింది. 1930 ఏప్రిల్ 1న నిజాం ప్రభుత్వం ఈ మార్గాన్ని తన ఆధీనంలోకి తీసుకున్నది. వచ్చిన నష్టాలను పూడ్చుకోవడానికి, రైల్వే మార్గాలను 1924 ఫిబ్రవరి 1న వరంగల్ వరకు, 1928 నవంబర్ 15న బలార్షా వరకు పొడిగించారు. 1966 అక్టోబర్ 2న దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటైంది. హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనమై 78 ఏండ్లు గడుస్తున్నది. కానీ, హైదరాబాద్‌కు అత్యంత సమీపంగా ఉన్న జాతీయ రహదారి అప్పుడు 9. ఇప్పుడు 65కు రైలు మార్గం లేకపోవడం విచారకరం.

బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ మార్చడం అంటే అభివృద్ధిలో జాతీయ రహదారి 65కు స్థానం లేకుండా చేయడమే. కేంద్ర

బుట్టాయిగూడెం శివాలయంలో ఘనంగా అన్నప్రసాద వితరణ

తండ్రి జ్ఞాపకార్థం అన్నప్రసాద సేవ చేపట్టిన కుమారుడు బాలు

కూనవరానికి చెందిన శక చిరంజీవి జ్ఞాపకార్థం కార్యక్రమం



ఎటపాక, నవంబర్ 09 (మీ వార్త ప్రతినిధి): పవిత్ర సోమవారం సందర్భంగా ఎటపాక మండలం బుట్టాయిగూడెం గ్రామంలోని శ్రీ శివాలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కూనవరం గ్రామానికి చెందిన దివంగత శక చిరంజీవి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బాలు ఆలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తండ్రి జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఆధ్యాత్మిక సేవా కార్యక్రమానికి ముందుకు రావడంపై భక్తులు అభినందనలు తెలిపారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ భక్తులు, దాతల సహకారంతో ప్రతి సోమవారం ఆలయంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. సేవాభావంతో కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకొస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కుసుమరాజు సురేష్, కిలారు రాజశేఖర్, అరవ కామేశ్వరరావు, సరియం బుజ్జి, పులుసు కోటేశ్వరరావుతో పాటు స్థానిక గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. సోమవారం కావడంతో ఆలయ ప్రాంగణమంతా శివనామస్మరణతో మారుమోగి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

కూటమి పాలన లో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

టీడీపీ సీనియర్ నాయకులు జాస్తి లక్ష్మి నారాయణ

స్థానిక ఎన్నికల్లో విజయం సాధించిన జడ్పీటీసీ కి సత్కారం

లింగపాలెం, నవంబర్ 10 (మీ వార్త విలేఖరి) టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమానికి ప్రజలు పట్టం కట్టారని టీడీపీ నాయకులు జాస్తి లక్ష్మి నారాయణ అన్నారు. మండల పరిధిలోని మఠంగూడెం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జాస్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు జాస్తి లక్ష్మి నారాయణ అమెరికా పర్యటన ముగించుకుని సొంత గ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు టీడీపీ నాయకులు అభిమానులు స్వాగతం పలికారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అఖండ విజయం సాధించడం



తో వారిని మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.నియోజకవర్గశాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్, ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బడేటి చంటి తో పాటు మండల జడ్పీటీసీ గా ఎన్నికయిన ముసునూరి వెంకట సరోజిని రాము దంపతులను జడ్పిటిసి గా గెలిచిన ముసునూరి వెంకట సరోజిని రాము దంపతులను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

97% జడ్పీలు, ఎంపీపీలు కూటమికే ఇచ్చిన ప్రజల రుణం తీర్చుకుంటాం.. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్.

కూటమికి పట్టణాల్లో 94%, పల్లెల్లో 97% శాతం స్ట్రైక్ రేట్.

విజయం సాధించిన అభ్యర్థులందరికీ ఏలూరు ఎంపీ శుభాకాంక్షలు.

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చేలా పాలన చేయాలని సూచన.

?ఏలూరు, నవంబర్ 08: ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఇటీవల జరిగిన మున్సిపల్, కార్పొరేషన్, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి పార్టీల అభ్యర్థులందరికీ ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ యాదవ్ హృదయపూర్వక శు



భాకాంక్షలు తెలియజేశారు. ఈమేరకు ఆయన ఆదివారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. 2024 ఎన్నికల ఫలితాలను మించి 60 శాతం పైగా ఓట్లు సాధించడంతో పాటు, 13 కార్పొరేషన్ లలో ఒకటి మినహా అన్నీ, 28 జిల్లా పరిషత్ లలో ఒకటి మినహా మిగిలినవి అన్నీ కూటమి పార్టీలకు దక్కడం పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా 659 ఎంపీపీలలో 630 పైగా స్థానాల్లో కూటమి విజయకేతనం ఎగురవేయడం , ప్రతిపక్షంకు పదిశాతం పదవులు కూడా దక్కని పరిస్థితిలో, ఇప్పటికైనా ఆ పార్టీ నేతలు తమ విధానాలను పునఃపరిశీలించుకోవాలని ఎంపీ కోరారు.

మున్సిపల్, కార్పొరేషన్ ఫలితాలకు మించి జడ్పీటీసీ ఎంపిటిసి ఫలితాలు ఉంటాయని తాను చెప్పినట్లుగానే కూటమికి ఈ ఎన్నికల్లో 97% శాతం స్ట్రైక్ రేట్ రావడం తనకు ఎంతో ఆనందం కలిగించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్ అభివృద్ధి, పారదర్శక పాలనపై ప్రజలు ఉంచిన విశ్వాసానికి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనం అని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ అన్నారు.

ప్రజాస్వామ్యంలో ఎన్నికల ద్వారా ప్రజలు తమకు నచ్చిన నాయకులను ఎన్నుకోవడం గొప్ప విషయం అని, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ విజయం సాధించిన అభ్యర్థులందరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ గారు ఆకాంక్షించారు.

?గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్య, వైద్యం వంటి ప్రజా అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని సూచించారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ కోరుతూ విజయం సాధించిన అభ్యర్థులకు శు

ఇండస్ట్రీలోకి రాకముందే ముక్కుకు సర్జరీ చేయించుకున్నా.. ఆసక్తికర విషయాలు బయటపెట్టిన జాన్వీ కపూర్!



బాలీవుడ్ అందాల తార, దివంగత నటి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ తన సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను బయటపెట్టారు. సినిమాల్లోకి రావడానికి ముందు తన తల్లి శ్రీదేవి పెట్టిన కండిషన్లు, ఆమె ఇచ్చిన సలహాల గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. అంతేకాదు.. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడానికి ముందే తన ముక్కుకు సర్జరీ చేయించుకున్నట్లు కూడా చెప్పుకొచ్చారు. తొలుత తాను సినిమాల్లోకి వస్తానంటే తల్లి శ్రీదేవి పెద్దగా ఆసక్తి చూపించలేదని, అయితే ఆ తర్వాత తన నిర్ణయానికి మద్దతు ఇచ్చిందని తెలిపారు. ప్రస్తుతం జాన్వీ చేసిన ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. జాన్వీ కపూర్ తన తల్లి శ్రీదేవితో ఉన్న అనుబంధం గురించి ఎప్పటికప్పుడు పలు సందర్భాల్లో మాట్లాడుతూనే ఉంటారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా తన కెరీర్‌కు సంబంధించి తల్లి ఇచ్చిన సలహాలను గుర్తు చేసుకున్నారు. తాను సినిమాల్లోకి రావాలని నిర్ణయించుకున్నప్పుడు ఆ విషయాన్ని మొదట శ్రీదేవికి చెప్పానని, అయితే ఆమె వెంటనే అంగీకరించలేదని తెలిపారు. సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడం అంటే సాధారణ విషయం కాదని, ఈ రంగంలోకి వస్తే జీవితాంతం నటనకే అంకితం కావాల్సి ఉంటుందని తన తల్లి చెప్పినట్లు వెల్లడించారు. ఈ వృత్తిలో ఎన్నో సవాళ్లు ఎదురవుతాయని, పూర్తి నిబద్ధతతో పనిచేయాల్సి ఉంటుందని శ్రీదేవి తనకు వివరించినట్లు చెప్పారు. మొదట్లో తనపై తల్లికి అంతగా నమ్మకం ఉండేది కాదని కూడా జాన్వీ పేర్కొన్నారు. ఈ ఇంటర్వ్యూలో జాన్వీ చెప్పిన మరో విషయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సినిమాల్లోకి రావడానికి ముందు తన ముక్కుకు సర్జరీ చేయించుకున్నట్లు ఆమె వెల్లడించారు. తన తల్లి సూచన మేరకే ఈ నిర్ణయం తీసుకున్నానని, ఆ తర్వాతే తనలో నటిగా కొనసాగగల లక్షణాలు ఉన్నాయని శ్రీదేవి భావించినట్లు చెప్పుకొచ్చారు. అయితే జాన్వీ వ్యాఖ్యల నేపథ్యంలో ఆమె అందం, సినీ రంగ ప్రవేశానికి ముందు చేసిన మార్పుల గురించి సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. ఇప్పటికే పలుమార్లు తన వ్యక్తిగత రూపం, అందం గురించి జాన్వీ బహిరంగంగా మాట్లాడారు. అందం విషయంలో ఇతరులతో పోల్చుకోవడం సరికాదని, సోషల్ మీడియాలో కనిపించే అందమైన చిత్రాలను చూసి యువతులు తమను తాము తక్కువగా భావించుకోవద్దని సూచించారు.తన వ్యక్తిత్వం, అందం, కెరీర్‌కు సంబంధించిన ఎన్నో విషయాల్లో తల్లి ప్రభావం ఉందని జాన్వీ గతంలోనూ వెల్లడించారు.

బ్లాక్ అవుట్‌ఫిట్‌లో బ్యూటీ క్వీన్ త్రిప్తి దిమ్రి అందాల విందు





ఓటీటీలోకి వస్తున్న ‘గరివిడి లక్ష్మి’.. ఆనంది నటించిన బయోపిక్ ఎక్కడ చూడొచ్చంటే?

1980, 90వ దశకాల్లో తన జానపద పాటలు, బుర్రకథలు, కథాగానంతో ఉత్తరాంధ్ర ప్రజలను అలరించిన ప్రముఖ జానపద కళాకారిణి గరివిడి లక్ష్మి జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం ‘గరివిడి లక్ష్మి’. టాలీవుడ్ నటి ఆనంది టైటిల్ రోల్‌లో నటించిన ఈ సినిమా అక్టోబర్ 17న థియేటర్లలో విడుదలై ప్రేక్షకుల నుంచి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. త్వరలోనే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. తాజా సమాచారం ప్రకారం ‘గరివిడి లక్ష్మి’ సినిమా నవంబర్ 13, శుక్రవారం నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఓటీటీ విడుదల తేదీ, స్ట్రీమింగ్‌కు సంబంధించిన వివరాలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అధికారిక ప్రకటన వెలువడితే సినిమా డిజిటల్ రిలీజ్‌పై మరింత స్పష్టత రానుంది. ఉత్తరాంధ్రలోని విజయనగరం జిల్లా గరివిడి గ్రామానికి చెందిన జానపద కళాకారిణి లక్ష్మి జీవితంలోని సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. చిన్న వయసులోనే వివాహం చేసుకున్న లక్ష్మి, భర్తకు అప్పటికే మరో పెళ్లి జరిగిందని తెలుసుకుని జీవితంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఈ పరిస్థితుల్లో ఆమె తల్లి దేవుడమ్మ తన కూతురికి అండగా నిలుస్తుంది. ఆ తర్వాత లక్ష్మికి బుర్రకథలు, జానపద పాటలపై ఆసక్తి పెరుగుతుంది. సత్తిబాబు పరిచయంతో అతడితో కలిసి ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభిస్తుంది. తన గాత్రంతో, కథాగానంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ క్రమంగా మంచి గుర్తింపు తెచ్చుకుంటుంది. అయితే ఆమె జీవితంలో పేరు ప్రఖ్యాతులతో పాటు అనేక చేదు అనుభవాలు కూడా ఎదురవుతాయి. లక్ష్మి జీవితంలో సత్తిబాబు పాత్ర ఎలాంటి మలుపులు తీసుకొచ్చింది? ప్రేమ పేరుతో అతడు ఆమెను ఎలా మోసం చేశాడు? ఆమె పాడిన పాటలు, సంపాదించుకున్న గుర్తింపును ఇతరులు ఎలా సొంతం చేసుకున్నారు? కళాకారిణిగా ఎదిగిన లక్ష్మి వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు ఏమిటి? అనే అంశాలను ఈ సినిమాలో చూపించారు.అంతేకాదు, లక్ష్మికి తిరిగి గుర్తింపు తీసుకురావడానికి రాంబాబు చేసిన ప్రయత్నాలు, ఆమె జీవితంలో చోటుచేసుకున్న పరిణామాలు కథలో కీలకంగా నిలుస్తాయి. ఒక జానపద కళాకారిణి ప్రయాణం, ఆమె పోరాటం, కళకు దక్కాల్సిన గౌరవం వంటి అంశాలను ఈ చిత్రం తెరపై ఆవిష్కరించింది. ఈ సినిమాలో ఆనంది గరివిడి లక్ష్మిగా ప్రధాన పాత్ర పోషించగా, సీనియర్ నటి రాశి ఆమె తల్లి దేవుడమ్మ పాత్రలో కనిపించారు. వీకే నరేశ్, రాగ్ మయూర్, శరణ్య ప్రదీప్, అంకిత్ కొయ్య, మీసాల లక్ష్మణ్, కంచరపాలెం కిషోర్, కుశాలిని తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

సూపర్ న్యాచురల్ హారర్ థ్రిల్లర్ ‘డెమోంటే కాలనీ 3’ ఆన్ ది వే



। తెలుగులో రిలీజై మంచి టాక్ తెచ్చుకున్న తమిళ ఫ్రాంచైజీల్లో ఒకటి ‘డెమోంటే కాలనీ ’ ఆర్ అజయ్ జ్ఞానముత్తు రచన, దర్శకత్వంలో ఇప్పటికే డెమోంటే కాలనీ 2 కూడా వచ్చిందని తెలిసిందే. ఇప్పుడిక థర్డ్ పార్ట్ టైం వచ్చేసింది. సూపర్ న్యాచురల్ హారర్ థ్రిల్లర్‌గా రాబోతున్న డెమోంటే కాలనీ 3 విడుదల తేదీపై క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. ఈ మూవీలో ప్రియా భవానీ శంకర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించగా.. అరుల్ నిధి లీడ్ రోల్ పోషిస్తున్నాడు. ఈ మూవీ పలు వాయిదాల తర్వాత ఫైనల్‌గా 2027 పొంగళ్ కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది. థర్డ్ పార్ట్‌లో అర్చనా రవిచంద్రన్ మీనాక్షి గోవింద రాజన్‌తోపాటు ఇతర నటీనటులు కీలక పాత్రలు పోషించారు. శ్యామ్ సీఎస్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ మూవీ ప్రమోషన్స్ త్వరలోనే షురూ కానున్నాయి. 2015లో చిన్న సినిమాగా విడుదలై బాక్సాఫీస్ వద్ద గ్రాండ్ సక్సెస్ అందుకుంది డెమోంటే కాలనీ. మళ్లీ 8 ఏండ్ల తర్వాత వచ్చిన సీక్వెల్ పార్ట్‌లో అరుణ్‌పాండియన్, ముత్తుకుమార్, మీనాక్షి గోవిందరాజన్, అర్చన రవిచంద్రన్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.